ప్రజాశక్తి

స్నేహ

Entered.

అక్టోబర్ 30, 2005



టూరింగ్ నుండి ఐమాక్స్

నల్లజాతిని నిద్రలేపిన 'రోసా'

టర్నింగ్ పాయింట్

దిల్ హై మేరా - ఫోన్‌కాల్ తేరా

క్యాంపస్ ఛాట్

శోభానాయుడు

ఈవారం అతిథి

హ్యాపీ బర్త్ డే

(30.10.2005 నుంచి
5.11.2005 వరకు)

శ్రీకాంత్
అక్టోబర్-30
అమరావతి-శివశంకర్
రెంటచింతల-గుంటూరు

ఎస్.సుష్మ
4సం॥, 30.10.2001
భాగ్యరేఖ-నర్సిములుగౌడ్
ధన్వాడ-మ॥నగర్

బి. సహనాబ్యాల
1సం॥, 30.10.2004
సంతోష-సంజీవ్‌రావు
కొత్తకోట-మ॥నగర్

ఎస్. మౌన్య
3సం॥, 31.10.2002
మాధురి-శ్రీనివాస్
గోపాలపట్నం-విశాఖపట్నం

సిహెచ్. దాక్షాయణి
7సం॥, 31.10.1998
కృష్ణవేణి-ఉమా
కురుపాం-విజయనగరం

అక్షయ్
10సం॥, 30.10.1995
ధనలక్ష్మి-విజయ్‌బాబు
సీతాఫల్‌మండి-సికింద్రాబాద్

సుజయ్ స్రవంత్
1సం॥, 31.10.2004
శాంతి-సత్యాజీ
బాలాజీపాల్-విశాఖపట్నం

డి. అఖిల్
3సం॥, 30.10.2002
సురేఖ-రమేష్
హనుమాన్‌నగర్-ఆదిలాబాద్

ఎ. ఐశ్వర్య
4సం॥, 30.10.2001
శశికళ-రాంసుందర్
దిల్‌సుఖ్‌నగర్-హైదరాబాద్

జి.ఐశ్వర్య
నవంబర్-1
జి.నారాయణ
మక్తల్

కె. సాయి కళ్యాణి
4సం॥, 1.11.2001
పద్మావతి-వెంకట్రావు
సమతానగర్-ఒంగోలు

ఎస్‌కె. షాహిన్
4సం॥, 2.11.2001
మున్నీర్-హబీబ్
పామూరు-ప్రకాశం

ఎస్. సాయిధనుష్‌గౌడ్
4సం॥, అక్టోబర్-2001
శకుంతల-యాదన్నగౌడ్
సరస్వతీనగర్-సికింద్రాబాద్

బి. కుశాల్
1సం॥, 2.11.2004
ఉమా-శ్రీనివాసాచారి
పార్శీగుట్ట-సికింద్రాబాద్

ఎ.వి.టి.సాహితి
3సం॥, 2.11.2002
సునీత-శేషిరెడ్డి
కలసపాడు-కడప

కె. అజిత్‌చంద్
10సం॥, 3.11.1995
రత్నకుమారి-మోహన్‌చంద్
శావల్యాపురం-గుంటూరు

పి. అఖిల
1సం॥, 3.11.2004
పద్మ-నాగరాజు
అమరచింత-మ॥నగర్

పి. స్మైలి
5సం॥, 5.11.2000
స్టాలిన్‌రాణి-ప్రసాద్
నిజాంపట్నం-గుంటూరు

బి. సమత-ఆదర్శ్
పావని-పాపారావు
మాధవధార-విశాఖపట్నం

వై. కార్తికేయ
1సం॥, 1.11.2004
నాగశిరోమణి-శ్రీనివాస్
గన్నవరం-కృష్ణా

ఎల్లోర
3సం॥, అక్టోబర్-2002
ఎథిన-గిరికాశ్యప్
న్యూయార్క్-అమెరికా

వినీల్ వర్షిన్
2సం॥, 30.10.2003
శశిరేఖ-నరేందర్
దుబ్బాక-మెదక్

టి. కార్తిక్
3సం॥, 31.10.2002
తులసి-శంకర్
బిడిఎల్-మెదక్

జి. రాఘవ రవళి
10సం॥, 30.10.1995
శైలజ-నర్సింహారావు
ఏలూరు-ప॥గో॥

డి. శ్రీహర్షిత
2సం॥, అక్టోబర్-2003
సరళ-సతీష్
చిమలగడ్డ-వికారేకల్

ఆర్. సాత్విక
2సం॥, అక్టోబర్-2003
దమయంతి-రామకృష్ణ
పారవకోట-శ్రీకాకుళం

బి. అభ్యుదయ్(సన్నీ)
1సం॥, అక్టోబర్-2004
నాగజ్యోతి-అయోధ్యరెడ్డి
తుర్కపల్లి-నల్లగొండ

ఎ. రమణ
2సం॥, అక్టోబర్-2003
బాలమణి-కృష్ణ
బస్వాపురం-నల్లగొండ

డి. సాయికృష్ణ
10సం॥, అక్టోబర్-1995
వరలక్ష్మి-సంజీవ్
విజయపురి కాలనీ

ప్రహర్ష
3సం॥, అక్టోబర్-2002
సుభాషిణి-తిరుపతన్న
గంజిపేట-మ॥నగర్

ఈ వారం అతిథి

మన అతిథి గురించి...

పేరు : శోభానాయుడుగా మనందరకూ తెలిసిన శోభాదేవి
పుట్టిన ఊరు : విశాఖజిల్లా అనకాపల్లి
విద్య : బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్ట్స్
వృత్తి : నాట్యాచార్య, కూచిపూడి నృత్య అకాడమీ వ్యవస్థాపకురాలు
నచ్చిన వ్యక్తి : రుక్మిణీ అరుండేల్(భరతనాట్య కళను నిలబెట్టిన మహనీయురాలు, మద్రాసు కళాక్షేత్ర స్థాపకురాలు)
నచ్చని అంశం : హిపోక్రసీ

మనస్సులు ఎదగాలి

మన చుట్టూ మోహరించి ఉన్న ప్రసారమాధ్యమాలు మనకు మంచి కంటే చెడునే చేస్తున్నాయి. ముఖ్యంగా మన తెలుగు భాషను సర్వనాశనం చేస్తున్నాయి. టీవీలలో మాట్లాడే యాంకర్లు తెలుగును మరీ దారుణంగా ఖూనీ చేస్తున్నారు. మన తెలుగును మనం చక్కగా మాట్లాడలేమా చెప్పండి? ఏ ఇద్దరు ఇంగ్లీషు మాట్లాడుకునేవాళ్లు కనబడ్డా వాళ్లు కచ్చితంగా తెలుగువాళ్లే అయివుంటారు. ఆ ఇంగ్లీషు కూడా చాలా లోపభూయిష్టంగా మాట్లాడుతుంటారు. ఎందుకలా...?! రానప్పుడు మనదైన తెలుగే మాట్లాడవచ్చు కదా! అదే తమిళులలో, మళయాళీలో అయితే తమ స్వంత భాషలోనే మాట్లాడుకుంటారు. అందుకే ముందుగా మన భాషపట్ల మనం బాధ్యతాయుతంగా ఉండాలంటాను. ప్రస్తుతం నడుస్తున్న పాశ్చాత్య మోజువల్ల మన సంస్కృతికి తీరని నష్టం వాటిల్లుతోంది. అది ఏ మాత్రమూ మంచిది కాదు. బడి చదువుల్లో ఇది మన సంస్కృతి, దాని విలువ ఇది అని చెప్పే పాఠ్యాంశాలే లేవు. ఎన్నెన్నో త్యాగాలు చేసి సమాజాన్నింత ఉన్నత స్థితికి తెచ్చిన మహానుభావుల గురించి నేటి తరానికి చెప్పే అంశాలే లేవు. ఎంతసేపూ కాంపిటేటివ్ పరీక్షలు, ఐఐటీలు, కంప్యూటర్ సైన్సులేనా... ఇలాంటి వెన్నో పెరుగుతున్నాయి కానీ మనసే పెరగటం లేదు. ఒకరిపట్ల ఒకరికి ప్రేమ ఆప్యాయతలే పెరగటం లేదు. పాశ్చాత్య సంస్కృతిని మక్కికిమక్కీ అనుకరణలో పోయి మనం కూడా మదర్స్ డేలు జరపటం దేనికో నాకు తెలియదు. విదేశీయుల కుటుంబాల్లో పిల్లలు ఎక్కడో తల్లిదండ్రులెక్కడో జీవిస్తుంటారు కాబట్టి ఏడాదికొక్కసారి తల్లుల దినోత్సవం జరుపుకుంటారు. కానీ ఇక్కడ మనకు రోజూ తల్లుల దినోత్సవమే కదా...ఫాదర్స్ డే, లవర్స్‌డే ఇలా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా మనకెందుకీ సంస్కృతి చెప్పండి? గ్లోబలైజేషన్ వల్ల మన సంస్కృతిలో అనేక పెడధోరణులు ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో తల్లిదండ్రులు, బయట ఉపాధ్యాయులే కదా నూతన తరానికి గురువులు. కొందరు తల్లిదండ్రులు డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌లంటూ తమ పిల్లల చేత ఎలాంటి జుగుప్సాకర నృత్యాలు చేయించి చప్పట్లు కొడుతూ చూస్తున్నారో చెప్పలేం. స్త్రీలు కూడా బయటకెళ్లి ఏదోక ఉద్యోగం చేయాల్సివస్తోంది, కానీ ఏదన్నా తేడా వస్తే నీ వల్లే కదా ఇలా అయింది. నిందలు వేస్తున్నారు. ఏది అవసరమో దానిని ఏర్పాటు చేసుకోవడంగా కాకుండా లగ్జరీస్ కోరుకోవడం, వాటికోసం పరుగులు తీయడం, అందుకోసం అన్ని విలువలు వదిలేయడం చేస్తున్నారు. కుటుంబ విలువలు పడిపోవడంలో డబ్బు పాత్ర చాలా పైశాచికంగా ఉందనకతప్పదు. మహిషాసురుడో, నరకాసురుడో భౌతికంగా లేరు గానీ మానసికంగా ఉన్నారు. అలాంటివి రూపుమాపేందుకు నేను విజయోస్తు నారీ, వివేకానందుడు లాంటి కళాప్రక్రియల ద్వారా, నా శ్వాస, ప్రాణం అయిన నాట్యకళ ద్వారా ఈ నవసమాజంలో ఉన్నత విలువలకోసం కృషిచేస్తున్నాను... చేస్తాను.

శోభానాయుడు

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
నేర్చుకుందాం..రా! 7
క్యాంపస్ చాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కామన్ సెన్సు 20
ఓ ఊరి కథ 21

సీరియల్ 17
మాధవి



ఇంకా...

మనసా తెలుసా 3
తిరుగుబాటు ధోరణిని ప్రేరేపించకండి

ఎవరు అనాథ
పండుగ పందిరి 18



ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

ఒకదాన్ని మించి...

అట్టమీది కథ 'మన ఆహారం పిజ్జా బర్గర్లా...?' చాలా బాగుంది. ఈ వారం అతిథిలో 'ఓటర్లలో చైతన్యం పెరిగింది' మొదలుకొని ఈ సంచికలో వచ్చిన మిగతా విశేషాలన్నీ ఒకదాన్ని మించి మరొకటిగా ఉన్నాయి. పాఠకులను ఆనందపరచడంతో పాటు ఆలోచింపజేశాయనడానికి ఎట్టి సంశయమూ లేదు.

సిరిపురపు రామకోటేశ్వరరావు, ఎనికేపాడు,



అరుదైన సమాచారం

లవకుశ గూర్చిన వ్యాసం బాగుంది. చాలా విలువైన, అరుదైన సమాచారమది. సినిమా విడుదలైన సంవత్సరాన్నివ్వకపోవడం ఒక పెద్ద లోటు. పాత లవకుశ(1934) గురించి రాశారు. ఆ తర్వాత వచ్చిన లవకుశ(1957)లోని ఫొటో వేశారు. ఇలా పాఠకులను అయోమయానికి గురిచేయడం భావ్యం కాదు. రాసిన వ్యాసం తాలూకు స్టిల్స్ దొరకనప్పుడు కనీసం ఆ చిత్రంలోని నటీనటుల బొమ్మలనైనా వేయించండి.

ఆర్. వి. రాఘవరావు, ఒంగోలు.

(పొరబాటును గుర్తింపజేసినందుకు ధన్యవాదాలు)

ఓ తార...

స్నేహ ముచ్చటగా ముస్తాబై మా ముందుకొచ్చి ముచ్చటిస్తోంది. టర్నింగ్ పాయింట్‌లో బాల్యవివాహాలు, కులీన వివాహ పద్ధతి, సతీసహగమనమనే దురాచారం విరివిగా కొనసాగుతున్న రోజులవి. 'దేవుడొక్కడే' అంటూ బైబిల్ గ్రంథాన్ని హెబ్రూభాష నుండి బెంగాలీ భాషలోకి అనువదించిన బహుభాషా కోవిదుడు, సకల కళాపండితుడు రాజారామ్మోహన్ రాయ్. ఈయన 'భారతదేశ చరిత్రలో ఓ తార' అని చెప్పక తప్పదు.

'స్త్రీ జాతికి మేలు చేసిన ఆ మహనీయుని కృషి మహోన్నతమైంది' అంటూ 'స్నేహ'లో సుగుణాల సంపన్నంగా ముద్రించారు. విజ్ఞానదాయకమైన విషయాలను మా ముందుంచుతున్న స్నేహ విజయపథంలో కొనసాగాలనాశిస్తూ... ఆకాంక్షిస్తూ...

కర్రా వరప్రసాద్, యలమర్రు కంద్రిక కృష్ణా జిల్లా.

టెన్షన్...

వేంప్రతి ఆదివారమూ 'స్నేహ' రాగానే మాధవి సీరియల్‌ను చదవకుండా ఉండలేకపోతున్నాం. 'మున్ముందు ఏం జరుగుతుందా?' అనేంత కుతూహలంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాం. విజ్ఞాన వినోదాలకు ప్రతి పేజీ అత్యుత్తమంగా ఉంది.

ఇస్మాయిల్, కొడుమూరు, కర్నూలు.

పదబంధం శీర్షిక కావాలి

భారతీయులు గత వైభవ సమాహారం తినక పిజ్జాబర్గర్లు తింటూ చచ్చేట్లున్నారు. స్త్రీ జనోద్ధారకుడు రాజారామ్మోహన్ రాయ్‌కి స్త్రీలు రుణపడున్నారు. ఎమ్మెస్ రెడ్డి భోళాతనం బాగుంది. కవర్ స్టోరీ వివరణ ఆలోచనాత్మకంగా ఉంది. బనగానపల్లె చరిత్ర క్లుప్తంగా ఉంది. విజ్ఞాన వీచికలోని అంశాలు చాలా బాగున్నాయి. లడ్డూ, బూరెలు, కొత్త వరసలో బాగుంది. సొంత మెకానిజం కొంత బాగుంది. 'స్నేహ'లో పదబంధ శీర్షిక పెట్టండి. హాస్యం పెంచాలి.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

ఓ నా 'స్నేహ'ం...

నండే నిను చూడకుంటే వాడుతుంది మోహం... క్యాంపస్ ఛాట్ అంటే నాకు మోహం... ఇన్ఫోర్‌టైన్‌మెంట్ ఒనర్చుకున్న ప్రవాహం... అందుకే నా 'స్నేహ'ం కోసం ఈ కవితాకల(ం)

ఆర్. వెన్ని, హిమకుంట్ల, కడప.

ఆశ్చర్యపోయాం

ఈ వారం టర్నింగ్ పాయింట్ శీర్షిక చాలా బాగుంది. సతీసహగమనం అనే దురాచారాన్ని చదివి నా మనస్సెంతో బాధపడింది. 'అప్పుడింత దారుణంగా ప్రవర్తించేవారా?' అని ఆశ్చర్యమేసింది. ఇలాంటి మంచి శీర్షికలనూ, సీరియల్‌ని అందిస్తున్న మీకు మా ప్రత్యేకాభినందనలు.

బి. శేఖర్ బాబు, ముంజేటి అప్పారావు,
కేడి పేట, విశాఖ.

బాగుంది

ఈ వారం 'స్నేహ' చాలా బాగుంది. మమల్నెంతగానో అలరించింది. టర్నింగ్ పాయింట్, ఇంటిసంగతులు, రుచి, జోక్స్ ఇలా అన్నీ బాగున్నాయి. ముఖ్యంగా అట్టమీద కథ మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. ఈ వారం మీ స్నేహ మళ్లీ మళ్లీ చదివేలా అనిపించింది.

జె శ్రావణి, ఎమ్ సుజాత, పాల్వంచ, ఖమ్మం.

ఆలోచనాత్మకంగా...

'స్నేహ' ముచ్చటైన రంగుల ముఖచిత్రంతో, మా ముందుకొచ్చింది. విజ్ఞానవీచిక శీర్షికలోని జీవపరిణామం అంశం చాలా ఆలోచనాత్మకంగానూ, విజ్ఞానదాయకంగానూ ఉంది. 'ఆరోగ్యం' శీర్షికలో విటమిన్ల పరంపరలో ఈ వారం విటమిన్-కె గురించి వచ్చిన సమాచారం సంపూర్ణంగా ఉంది. 28 పేజీల స్నేహ అనుబంధాన్ని అందర్నీ ఆకట్టుకునే రీతిలో విజయవంతంగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు. నేమాన

సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

మనసా... తెలుసా?

టీనేజీపిల్లలలో ఉక్రోషం, అసహనం ఎక్కువగా కనిపిస్తాయి. కారణం తామేర్పరుచుకునే మూర్తిమత్వ కోటలోకి ఎవరూ ప్రవేశించకూడదనే ప్రగాఢమైన ఆకాంక్ష. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు వీరిని సమర్థవంతంగా డీల్ చేయగల్గితే... వారిచేత ఏ పనైనా సరే అవలీలగా చేయించగల్గుతారు.

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,

ఫోన్ : 9849130141

తిరుగుబాటు ధోరణిని ప్రేరేపించకండి

"టీనేజీ పిల్లలను దార్లో పెట్టలేకపోతున్నాం'' అని బెంగపడడం కన్నా... వారిని దారిలోకి తీసుకురావడానికేం చేయాలో తల్లిదండ్రులు ఆలోచించాలి. అందుకు తమ సనాతన భావాలను విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉండాలి. తమ టీనేజీ పరిస్థితులనూ, ప్రస్తుత యువతరం పరిస్థితులనూ విభజించి చూడగల కోణాన్ని సంతరింపచేసుకోవాలి. మీ పిల్లలు ఇప్పటి దాకా మీరు చెప్పిందల్లా చేశారు. ఇకపై వారు చిన్న పిల్లలు కారు. అలాగని మీరు తీర్చిదిద్దాల్సిన అవసరం ఏ మాత్రమూ లేని పెద్ద పిల్లలూ కారు. వారిని దారిలో పెట్టవలసిన బాధ్యత ఇప్పటికీ మీదే. ఆ పనిని మీరిదివరకు చేసినట్టు చేస్తే కుదరదు. అది ఒక ప్రత్యేకమైన పద్ధతిలో ఉండాలి. పిల్లలకు నచ్చేట్లుండాలి. ఇలా ఉంటే తప్ప వారు మీ మాట వినరు.

ఇన్ని నిబంధనలా?

ఈ సమాజంలో ప్రతీదానికీ నిబంధనలున్నాయి. మనం పెరిగేకొద్దీ ఈ నిబంధనల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. ఈ అనుభవం ఎవరికైనా మొదటిసారిగా ఎదురయ్యేది ఇంట్లోనే. అప్పటి వరకు ఏ నిబంధనలూ లేకుండా పెరిగిన బేబీలకు కొంత కాలానికి... "అటువెళ్లకు", "ఇదిచేయకు", "తప్పు అలా అనకూడదు'' వంటి ఆంక్షలు చెవినపడతాయి. భోజనం చేయడమెలాగో, ఎప్పుడు ఎక్కడ ఆడుకోవాలో, ఇతర వ్యక్తులనెలా ఎదుర్కోవాలో అమ్మానాన్నలు మనకు చెబుతారు. ఏ రకమైన పనులుచేస్తే మనం చిక్కుల్లోపడతామో... ఎప్పుడు మనల్నందరూ మెచ్చుకుంటారో ఈ నిబంధనల వల్లే పిల్లలకు తెలుస్తుంది. అలా మొదలయ్యే ఈ నిబంధనల జాబితా సంగీతం నేర్చుకోవడం, క్రీడాపోటీలలో పాల్గోవడం, గ్రంథాలయాని కెళ్లడం వరకు విస్తరిస్తుంది. ఇది బాల్యంలో ఒక రూపాన్నీ, యుక్తవయస్సులో మరోరూపాన్నీ సంతరించు కుంటుంది. పెద్దవారైనా సరే వీటి కనుగుణంగానే నడుచుకోవాలి. అసలీ నిబంధనలే లేకపోతే... ప్రపంచం సవ్యంగా ఉండదు. టీనేజీపిల్లలు స్వతంత్ర్య భావాల నేర్పరుచుకునే తపనలో ఉంటారు. అందుకే వీరు ఈ నిబంధనలకు విరుద్ధంగా స్పందిస్తారు. సరిగ్గా ఈ దశలోనే ఈ నిబంధనలను వీరికలవాటు చేయాలి. వీటిని ఆచరించడానికి తమ పిల్లలను తల్లిదండ్రులు ఒప్పించాలి.

ఒప్పుకుంటారా?

తమ మీద ఆంక్షలు విధించడం పిల్లలకు నసేమిరా ఇష్టముండదు. అలాని వారిని వదిలేయలేం. ఎందుకంటే ఈ ఆంక్షల అవసరం వారికెక్కువగానే ఉంది. టీనేజీ పిల్లలపై విధించే ఆంక్షలు, నిబంధనలకు ఖచ్చితమైన ప్రమాణాలను నిర్దేశించకూడదు. ఖైదీలకు విధించే మాదిరిగా ఉండకూడదు. వీటి ప్రయోజనం వారికి బోధపడనంతవరకూ... వారికీ ఆంక్షలన్నీ కఠినమైనవిగానూ, నిరంకుశమైనవిగానూ అన్పిస్తాయి. అందుకే వీటి ప్రయోజనాలు పిల్లలకు ముందుగా తెలియజేయాలి. అదే సమయంలో అవి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పిల్లల అభిరుచులకు, అభిమతాలకు దగ్గరగా ఉండాలి. వారి మనస్సులను చూరగొనాలి. క్రమపద్ధతి లోపించిన ఆంక్షలు టీనేజీపిల్లలపై విధించకూడదు. ఎందుకంటే అవి వారిపై ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వవు.

ప్రతీసారీ తల్లిదండ్రులతో చెప్పించుకోవడం పిల్లలకిష్టముండదు. బాల్యదశలో ఉన్నపుడు పిల్లలు ప్రతి చిన్న విషయానికీ తల్లిదండ్రుల ఆసరా కోరుకుంటారు. వారుచెప్పిన దానిని బేషరతుగా అంగీకరిస్తారు. టీనేజీపిల్లలకీ ధోరణుండదు. అంటే తల్లిదండ్రుల ఆధిక్యతను వ్యతిరేకిస్తారని కాదు. తల్లిదండ్రుల పట్ల తమకున్న గౌరవభావాన్ని వాళ్లెప్పటికీ త్యజించరు. తమ స్వాభిమానం దెబ్బతినే ఆంక్షలు విధించడాన్నే పిల్లలు వ్యతిరేకిస్తారు.



పిల్లలు స్వతంత్రంగా ఆలోచించడం మొదలుపెడతారు. అదే సమయంలో ఇతరులు చేసే ప్రతి సూచననూ, మందలింపునూ స్వీకరించే తత్వం వారికుండదు. ఈ పోకడ సర్వసాధారణంగా 13, 14 వయసులో ఏర్పడుతుంది. ఈ వయసు పిల్లలను చిన్న మాట అనగానే బుసకొట్టే పాములా స్పందిస్తారు. తమ ధోరణి తప్పే అని వారికి స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ... దాన్ని వేరొకరు ఎత్తి చూపడాన్ని సహించలేరు. 'ఎవరో అయితే ఓకే... కానీ స్వంత మమ్మీ డాడీలమే కదా' అని మీరు భావిస్తే పొరబడినట్టే. ఎందుకంటే తమ స్వంత విషయాలకు సంబంధించినంత వరకు మీరూ వారికి పరాయి వ్యక్తులే! అందుచేత మీరేదిచెప్పినా వారినాకట్టు కునేలా ఉండాలి. అది ఒక నిబంధనగా ఉన్నట్లయితే వారిలో తిరుగుబాటు ధోరణి మొలకెత్తుతుంది. అది చివరికి మీ పిల్లలు మీ చేయి దాటిపోయేలా చేస్తుంది.

✣

టర్నింగ్ పాయింట్

శంకర్

లేవనని మొరాయించి నల్లజాతినే నిద్రలేపిన రోసా

మ్యూజియంలో ఉన్న ఆనాటి బస్సు



ఆమె ఓ నల్లకలువ
నల్లటి అందగత్తె
ఆమె ఓ తియ్యటి వగరొగరు నేరేడిపండు
నల్లటి బేనరుపై నుంచి విరుచుకుపడ్డ
నినాదం
ఆమె ఓ ధిక్కారస్వరం...శతాబ్దాలుగా
నివురుగప్పిన ఆగ్రహం
సమానహక్కుల ఉద్యమాన్ని పురిగొల్పిన
మాతృమూర్తి...రోసాపార్క్స్

ఆమె ఒక సాధారణ గృహిణి. వేన్నీళ్లకు చన్నీళ్లలాగా భర్త సంపాదనకు తోడుగా దర్జీపని చేసేది. ఆమె భర్త రేమాండ్ క్షురకుడు. ఇద్దరూ శ్రమైకజీవులు. అంతకుమించి మనుషులు. కానీ నల్లజాతివారిని కనీసం మనుషులుగా చూడని నేలమీద భయంకరమైన వర్ణవివక్షల కొలిమిలో బతుకుతున్నారు. శ్వేతజాత్యహంకారులు ఈ దేశం మాదే అనుకునే అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని మోంట్‌గొమెరీ నివాసులు. ఈ సాధారణ మహిళాదర్జీ రోసాపార్క్స్ నల్లజాతీయుల స్వేచ్ఛాసమానత్వాల ఉద్యమ మాతగా పేరొందింది. అమెరికాలో 1950ల 1960ల నాటి నల్లజాతీయుల పౌరహక్కుల ఉద్యమానికి కారకురాలయ్యింది. తెల్లజాత్యహంకారానికి వ్యతిరేకంగా ఓ చిన్న సణుగుడు కూడా భరించలేని ధిక్కారనేరంగా పరిగణించే రోజులవి. నల్లఉద్యమతరంగాలు లేచిన ఆ 1955ల నాటి శీతాకాలంలో ఓ ఇరవయ్యారేళ్ల మతభోధకుడైన మార్టిన్ లూథర్ కింగ్‌ని నల్లజాతిజనుల నాయకుడిగా మారడానికి ప్రేరకురాలయ్యింది. మట్టిముద్దల్లాంటి వారిని నల్లవజ్రపుతునకల్లా మార్చిన ఉద్యమానికి ఓ పెద్ద మలుపు ఆమె ఆ రోజు బస్సులో వేసిన గద్దింపు.

తెల్లవారి చరిత్రలో ఎన్ని రబ్బర్లతో రుద్దినా, ఎంత ఫినాయిల్ వేసి కడిగినా చెరిగిపోనంతటి దుర్మార్గం ఉంది. నల్లజాతి వారిని నిగ్గర్లుగా, నీగ్రోలుగా కాల్చుకుతిన్నారు. దానికి వ్యతిరేకంగా ఎంత పోరాటం చేయాల్సివచ్చిందో అది నల్లజాతీయుల తరతరాలవీరోచిత చరిత్రగా వెలుగొందుతోంది. అలాంటివెన్నో పోరాటాలు జరిగినా ఆ వర్ణవివక్ష ఏదో రూపంలో నల్ల కలువలను వెన్నాడుతూనే ఉంది. రైళ్లలో, బస్సుల్లో, కొన్ని ముఖ్య కూడళ్లలో, కార్యాలయాల్లో "నల్లజాతీయులకు, కుక్కలకు ప్రవేశం లేదు" అని బోర్డులు నిర్దాక్షిణ్యంగా వేలాడేవి. ఇప్పుడలాంటి బోర్డులేవీ వేలాడకపోయినా తెల్లబుర్రల్లో ఊగుతున్నాయి.

అది 1955 డిశెంబర్ 1వ తేదీ. వణుకుపుట్టించే చలి, గడ్డకట్టిన మంచు. అలబామా రాష్ట్రం, మోంట్‌గొమెరి ఊళ్లో క్లేవ్‌లాండ్ ఎవెన్యూ బస్సు ఆగింది. ప్రయాణికులందరితో పాటుగా మహిళాటైలర్ అయిన రోసా పార్క్స్ ఆ బస్సు ఎక్కింది. ఆ రోజుల్లో బస్సులోని ముందు సీట్లు, మధ్యలో ఉన్న సీట్లు తెల్లవారికోసం, వెనుక ఉండే కొద్దిసీట్లు మాత్రమే నల్లవారివి. ఎవరన్నా కూర్చున్నా తెల్లజాతి ప్రయాణీకులు రాగానే లేచి ఆ సీట్లు వాళ్లకివ్వాలి. చోటు లేకపోతే నిలబడైనా ప్రయాణించాల్సిందే. అలాంటి పరిస్థితిలో రోసా బస్సెక్కి ఖాళీగా ఉందికదాని మధ్య సీట్లలో కూర్చుంది. ఆమెతో పాటుగా మరో నలుగురు నల్లనయ్యలు కూడా కూర్చున్నారు. బస్సాగిన ఒకచోట తెల్లజాతీయుడు బస్సెక్కాడు. డ్రైవర్ నల్లవారిని లేచి సీటు తెల్లాయనకిమ్మన్నాడు. నలుగురు నల్లవాళ్లు లేచారు కానీ...రోసా లేవలేదు. కదలకుండా కూర్చుంది. అంతకు ముందు 1943లో జేమ్స్ బ్లేక్ అనే డ్రైవర్ తనను బస్సులోంచి తోసేసిన దుస్సంఘటన గుర్తొచ్చింది. లేవనంటే లేవనంది. ఆ సీట్లు ఖాళీగా ఉన్నాయికదా ఆ తెల్లాయన్ను కూర్చోమంది. లేచి నిలబడి, సీటివ్వమన్నాడు. రోసా ససేమిరా లేవనంది. లేవకపోతే పోలీసులను పిలిచి అరెస్టు చేయిస్తానన్నాడు. పిలుచుకో...అరెస్టు చేయించుకో అని మొరాయించింది. బస్సాపడం, పోలీసుల్ని పిలవడం, రోసాను అరెస్టు చేయించడం జరిగిపోయింది. నివురుగప్పిన నిప్పుకణికను వేయి నోళ్లతో ఊదిఊది రగిలించినట్లయ్యింది. అంతే 1946లో స్థాపించిన మహిళల విజ్ఞాపనా కౌన్సిల్ నుంచి మంచి ప్రతిస్పందన, కదలిక వచ్చింది. డ్రైవర్లను ధిక్కరించిన సంఘటనలు జరిగినప్పుడు నల్లవారు అరెస్టవ్వడమో, చంపివేయబడటమో జరుగుతుండేదని సీనియర్ న్యాయవాది యి డి నిక్సన్ చాలా బాధగా అన్నారు. అందుకే ఈ రోసా సంఘటనను అంత తేలిగ్గా వదిలిపెట్టదలుచుకోలేదు. నల్లజాతి మహిళా సంఘం కార్యకర్తలు నల్లవారెవరూ బస్సులెక్కకుండా బహిష్కరించాలనిముప్పైవేల కరపత్రాలు రాసి డిసెంబరు 4న పంచారు. మర్నాడు 5వతేదీ సోమవారం కోర్టులో రోసా పార్క్స్ కేసు విచారణరోజు. సోమవారం నాడు నల్లవారు ఎవ్వరూ బస్సెక్కవద్దని పిలుపిచ్చారు. నల్లజాతివారి పేపర్లు మొదటి పేజీలో ఈ ప్రకటనను ప్రముఖంగా ప్రచురించాయి. స్వంత టాక్సీలున్న నల్లవారు తమ టాక్సీల్లో బస్సుచార్జీ పది సెంట్లకే తోటి నల్లవారిని ఎక్కించుకుని వారెళ్లాల్సినచోట్లకు చేర్చారు. దాదాపు నలభైవేల మంది నల్లజాతీయులు ఇరవైమైళ్ల దూరమైనా నడిచే వెళ్లారు. ఆ రోజు రాత్రి ఒక చర్చి ఆవరణలో జరిగిన సభలో ఈ బస్సు బహిష్కరణ ఎన్నాళ్లయినా సమస్య పరిష్కరించేవరకూ కొనసాగించాలని అందరూ ఒకేమాటగా నిర్ణయించారు. బస్సులలో అందరికీ సమానగౌరవం, నల్లజాతి డ్రైవర్లకు కూడా పని, ఎవరుముందొస్తే వారికే మధ్య సీట్లు అని డిమాండ్లు ప్రకటించారు. డా॥మార్టిన్ లూథర్ కింగ్, నిక్సన్‌లతో సహా నల్లజాతి వారందరూ అనేక రకాల నిర్బంధాలకు గురయ్యారు. మూడొందల ఎనభై ఒక్కరోజుల బస్సు బహిష్కరణోద్యమం చివరకు 1956 నవంబర్13వ తేదీన సుప్రీంకోర్టు తీర్పుతో ముగిసింది. బస్సులలో ఈ వేర్పాటు సీట్ల విధానం చట్టవిరుద్ధంగా ప్రకటించింది. ఈ బస్సు సీటు సంఘటన అమెరికాలోని నల్లజాతీయుల పౌరహక్కుల ఉద్యమానికి బలమైన తొలి అడుగయ్యింది. అందుకే బస్సు సీట్లోంచి ససేమీరా లేవనని మొరాయించిన రోసా పార్క్స్, నిద్రాణమైన నల్ల చైతన్యాన్ని తట్టి లేపింది. అందుకే ఎన్నితరాలకైనా ఆమె "ది మదర్ ఆఫ్ సివిల్ రైట్స్ మూవ్‌మెంట్" పౌర హక్కుల ఉద్యమాల మాతగా మారింది.

గత కొద్ది కాలంగా అస్వస్థతకు గురైన ఆమె ఈ నెల 25వ తేదీన మరణించారు. అమెకు 92ఏళ్లు. ఆమె అంతిమయాత్ర సందర్భంగా నల్ల జాతీయుల నాయకుడు రెవరెండ్ జెస్సీ జాక్సన్ "రోసా అరెస్టు నాటి నల్లజాతిజనుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాల జైత్రయాత్రకు ద్వారం తెరిచినట్లయ్యింది" అన్నారు. ముమ్మాటికీ నిజమే కదా!



అమ్మమ ఆస్తి దక్కేదెలా?

మా నాన్నగారికి నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లయిపోయాయి. పెద్ద తమ్ముడు బిఎస్సీ ఫైనల్, చిన్న తమ్ముడు పదోతరగతి చదువుతున్నారు. అమ్మమ్మ మా అమ్మకిచ్చిన పొలాన్ని మా నాన్న కొన్ని ఇబ్బందుల కారణంగా 1991లో 13,000/- రూపాయలకు అమ్మారు. వారి పేరుమీద రిజిస్ట్రేషను చేయలేదు. మా తమ్ముళ్లకు పొలం గురించి తెలిసింది.మా భవిషత్తుకు ఎటువంటి ఆధారమూ లేనందున ఆ పొలాన్ని ఎలాగైనా కొనాలనుకుంటున్నాం. పొలం కొన్నవారితో మాట్లాడితే మొదట15వేలకిస్తామన్నారు. రెండురోజుల్లో ఆ దబ్బు సిద్ధం చేసుకున్నాం. వెళ్లి అడిగితే 25వేలకు అయితే ఇస్తామన్నారు. మళ్లీ 50 వేలకిస్తామన్నారు. మేం 15వేలకు మించి ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాం. కోర్టులో వేస్తే మా ఆస్తి మాకు దక్కుతుందా? తగిన సలహా ఇవ్వగలరు.

– పలుకూరి రజని, గొట్టప్రోలు గ్రామం, నెల్లూరు

మా భూమి ప్రైవేటుదన్నారు...

మావి మొత్తం 50 ఎస్సీ కుటుంబాలు. గత 90 సంవత్సరాలుగా ఇనాం భూమిలో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నాం. 1955 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వాధికారులు దాన్ని సర్వే చేయలేదు. ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయంలో ఇనాం భూమిగా ఎనిమిది కద్దులున్నాయి. మేం ఎన్నోసార్లు జిల్లా కలెక్టరు, ఆర్డీవోలను ఇళ్ల పట్టాలివ్వాలని అభ్యర్ధించాం. మా భూమి ప్రైవేటుదన్నారు. పట్టాలివ్వలేదు. ఇనాం భూమికి సంబంధించిన పత్రాలు మా దగ్గరున్నాయి. మాకు ఇళ్ల పట్టాలివ్వాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ వారు జిల్లా కలెక్టరుకు సిపార్సు చేశారు. అయినా ఫలితం లేదు. కోర్టు ద్వారా ఈ సమస్యనెలా పరిష్కారించుకోవాలో సలహా ఇవ్వగలరు.

బి. ఎల్లేష్, మలక్‌పేట. హైదరాబాద్

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

మీ అమ్మగారి సమ్మతితోనే అమ్మారేమో వివరంగా రాయాల్సింది. ఆ ఆస్తిని అమ్మితే దాని పరంగా కాగితాలు ఉండి ఉంటాయి. ఉంటే కొద్దిగా కష్టం. ఆ విధంగా కాగితాలు లేనట్లయితే ఆస్తి మీకు చెందే అవకాశముంది. అయినప్పటికీ మీరు ఈ విషయం గురించి సామరస్యంగా పరిష్కరించుకోవడమే ఉత్తమం.

మీరు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి. జిల్లా కలెక్టరుకు దరఖాస్తు చేయండి. 'అది ప్రభుత్వ' ఇనాం భూమి' అనితెలిపే పత్రాలన్నీ ఋజువుగా కమిషన్‌కు చూపించండి. అయినా కమిషన్ వారు సిఫారసు ఇవ్వకపోతే రాష్ట్రహై కోర్టులో రిట్ పిటిషన్ చేయాల్సి ఉంటుంది. దాంతో మీరు కోర్టు ఉత్తర్వులను బట్టి నడుచుకోవలసి ఉంటుంది.

నిద్రపోతున్నాడా

సోమూ నీ పక్కనున్న
వాడు నిద్ర
పోతున్నాడు
లేపరా
మీరే వాణ్ని నిదర
పుచ్చారు టీచర్
మీరే లేపండి.

నాక్లాసులో ఎవరూ నిదుర పోవటానికి వీల్లేదు. అలాగే టీచర్ మీరు కొంచెం పెద్దగా పాఠం చెప్పండి మరి.

- ఎంకెఆర్

ఇంటి సంగతులు

మా ఇంటి మా లచ్చవ్వ

పి. జ్యోతి

"ఓ! ఒదినె! మీ తల్లిగారింటికి మొన్న బత్కమ్మ పండుగకు బోవయితివి. దీపాలి పండుగకన్న బోతవ?" అడిగింది గౌరి పక్కింటి రాజమ్మను.

"ఏంబోత ఒదినె. నాకేడ తీర్తది. పిల్లగాండ్ల సిన్నప్పుడంటె... అల్లు నా ఎమ్మటి ఒచ్చిరి. పోతిని. గిప్పుడు గాల్లు పెద్దగయింర్రు. నాతోని రమ్మంటె ఒత్తరనుకున్నవ? 'గాడ టీవీలేదు ఏం లేదు. పోతె నువ్వుబో మేం రాం' అని అనబట్టిరి. ఎన్కట బత్కమ్మ పండుగ ఒత్తాందంటే ఏం నంబరపడేటోల్లం" అంది రాజమణి పాతరోజులు కన్నుల్లో మెదలగా.

"అవునొదినె! నాకు తెల్వదనా ఏంది. గిప్పుడు సూద్దావన్నా గా జోరు ఏడ కండ్లబడతాంది. పోయినై... అసొంటి రోజులన్నీ పోయినై... " అంది గౌరి పాత రోజులను నెమరేసుకుంటూ.

"బత్కమ్మ పండుగ సేసుకున్నట్టనిపించింద ఒదినె. ఎన్కట తొమ్మిది దినాలు బత్కమ్మను పేర్సేటోల్లం. పొద్దున సీకటిలోని బోయి బత్తాలకొద్దీ తంగేడు పువ్వు, గునుగుపువ్వు తెచ్చెటోల్లం. అయన్ని మా అవ్వ ఓ గింతెత్తు పేర్సేది. 'నా బత్కమ్మ పెద్దదంటే... అర్రె! నా బత్కమ్మ పెద్దది'అని లొల్లి పెట్టుకొనెటోల్లం. సమయం నాల్గయిందంటె తోటోల్లందరం గూడి ముచ్చట్లు బెట్టుకుంట సెరువుకట్టకాడికి బోయేటోల్లం. అందరం ఒక్కకాడ బెట్టుకుని కోలాటం ఆడేటోల్లం. "బత్కమ్మ బత్కమ్మ ఉయ్యాల" అని పాడేటోల్లం. సెరువు నీల్లల్ల బత్కమ్మను ఒదిలిపెట్టి అందరం గూడి "సిన్ని మీరేవిట్లు, సిన్నారక్కా ఏవిట్లు" అని పాడుకుంట ఎవరింటికి అల్లం ఒచ్చెటోల్లం. గిదంత తలుసుకుంటాంటె నాకు దండి సంబరమైతాందనుకొ"అని చిన్ననాటి రోజులను తలుచుకుంది రాజమణి.

"గిప్పటి పిల్లలకు గయన్ని ఏడ నచ్చుతయ్ ఒదినె. మా నాయనైతె ఫోన్ల మీద ఫోన్లు కొట్టుడు 'బిడ్డా! బత్కమ్మ పండుగకు రాకబోతివి. మాకెట్లనో ఉండె. జర దీపాలి పండుగకన్న ఒచ్చి అన్నకు, తమ్మునికి మంగలార్తి బట్టిపో. నువ్వొక్కదానివే ఆడబిడ్డవైతివి. గిట్లరాకపోతె ఎట్లనె. నువ్వు రాకపోతె దీపాలినాడు ఎన్ని దీపాలు బెట్టినా సీకటి తీర్గనె ఉంటుంది. నువ్వే గద బిడ్డ... మా ఇంటి ఎలుగు. గందుకే గా ఒక్కదినం అన్న తప్పకుంటరా బిడ్డ' అని అనబట్టె. నువ్వేవన్న అనుకొ ఒదినె నాకైతే మస్తు దు:ఖమొచ్చిందనుకొ" అంటూ కళ్లు తుడుచుకుంది రాజమణి.



"ఊకో! ఒదినె! ఏం బాదపడ్తవు గానీ. గా పిల్లగాండ్లకేం దెలుసు. ఆడ ఎంతమంచిగుంటదొ. అస్సలు సూడకనే పోతె ఏం దెలుత్తది. ఒక్కపారి తీస్కపొ అల్లకె తెలుత్తది. నేనూ మా తల్లిగారింటికి పోతె గింతదాన్నయినా ఇప్పటికి గూడ మా నాయన 'మా ఇంటి మా లచ్చవ్వ' ఒచ్చిందని ఎంత సంబరం పడ్తడను కున్నావ్. దీపాలికి అందురుగూడి పోంద్రి. మీ అమ్మ నాయన గూడ సంబరపడ్తరు. ఇగ నేను బోత ఒదినె. మీ అన్నొచ్చే టైమైంది" అంటూ ఇంట్లో కెల్లిపోయింది గౌరి.

నిజమే ఎంత వయసొచ్చినా ఆడపిల్లలకు పుట్టింటి మీద మమకార ముంటుంది. అందుకే ప్రత్యేకమైన రోజులలోనయినా తనను కన్నవాళ్లను, పుట్టిపెరిగిన ఇంటిని, చిన్ననాటి స్నేహితులను కలుసుకుని తనివితీరా ఆనందించాలనిపిస్తుంది. ఏ ఇంటికైనా వాకిలికి ముగ్గెంతందమో... అలాగే ప్రతిఇంటికీ ఆ ఇంటి ఆడపిల్ల అంత అందం. అందుకే పండుగల సమయంలో హడావిడి... సందడి వారిదే. గాజుల గలగలలు, కాలి అందెల నవ్వడి వట్టువరికిణీలతో నట్టింట్లో నడయాడుతూంటే ఎంత ఆహ్లాదంగా ఉంటుంది. అందుకే ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందని అంటూ ఉంటారు. ప్రత్యేకంగా పండుగలకు పెళ్లయిన ఆడపిల్లలను పిలుచుకుంటారు. వారికున్నంతలో పసుపూకుంకం పెట్టి పంపిస్తూ ఉంటారు. పండుగ సమయంలో వెళ్లి పల్లెటూళ్లలో ఉన్న పెద్దవారితో కలిసి ఉంటే వారు సంతోషిస్తారు. మనకు రోటీన్‌కు కాస్త వెరైటీగానూ ఉంటుంది. పిల్లలకూ పల్లెలు ఎలా ఉంటాయో తెలుస్తుంది. అక్కడి స్వచ్ఛమైన గాలీ నీరూ మనకు లభిస్తుంది. అలాగే మనం పెద్దల ఆశీస్సులనూ పొందొచ్చు. ✦



నేర్చుకుందాం...రా!

గాజులతో గారడీ

అగస్త్యరాజు లక్ష్మీ సూర్యకళ
ఫోన్ : 040-55889954

కొత్త దనాన్ని సృష్టించాలనే తపనుండాలే కానీ ప్రతి వస్తువుతోనూ నూతనత్వాన్ని సృష్టించొచ్చు. ప్రతి పనిలోనూ మనదైన ముద్రను ప్రదర్శించొచ్చు.

మట్టి గాజులనుపయోగించి వాల్ డెకరేటింగ్స్, కార్నర్ పీస్‌లు ఎలా తయారు చేసుకోవాలో ఈ వారం నేర్చుకుందాం.

మనలో చాలా మంది మ్యాచింగ్ గాజులేసుకోవడానికిష్టపడతారు. వీటిని వేసుకునేప్పుడు కొన్ని గాజులు చిట్లిపోతాయి. మరికొన్ని పగిలిపోతాయి కదూ. మరి వాటినేం చేస్తారు? కొందరేమో పారేస్తారు. మరికొందరు పగిలిన రెండు గాజు ముక్కలను కొనల వద్ద కాల్చి, వాటినొక ఆర్చిలాగా చేస్తారు. ఇది వరకూ మీరూ ఇలాగే చేసుండొచ్చు. ఇప్పుడు ఈ పగిలిపోయిన గాజులను అనేక రకాలుగా ఉపయోగించుకోవచ్చు. మీ గాజులు చిన్న చిన్న ముక్కలుగా పగిలిపోయాయా? అయితే మరీ మంచిది.

ఒక వెల్వెట్ షీటు తీసుకోండి. దాని మీద ఒక పువ్వు లేదా సీతాకోక చిలుక లేదా నెమలి ఇలా ఏదోక ఆకృతిని వేయండి. దీనిలో రంగురంగుల గాజు ముక్కలనతికించి చూడండి. ఎంత ఆకర్షణీయంగా ఉందో కదా! ఇప్పుడు దీనికి ఫ్రేము చేయించి షోకేసులో పెట్టారనుకోండి... మీ ఇంటికెవరొచ్చినా ఇక చూపు తిప్పుకోలేరేమో.

గాజులు కొంచెం చిట్లాయనుకోండి. వీటన్నింటినీ ఒకదానిలో ఒకటి మెల్లగా దూర్చి జడలాగా తయారు చేసుకోవాలి. గోడకు మధ్యభాగంలో తగిలించాలి. ఇదెలా ఉంటుందంటే... గాజులతో వేసిన పూలజడలాగా అన్నమాట. ఇలా కొంచెం చిట్లినవే

చాలా గాజులున్నాయా? ఈ గాజుల జడలను ఒక గదిలో ఎక్కువగా తిరగని వైపుకు వరుసగా వేలాడదీశారనుకోండి... గాజులతో ఆ గదిని రెండు భాగాలుగా విభజించినట్లవుతుంది. అంటే గాజుల పార్టిషన్ పద్ధతిని మనమే కొత్తగా సృష్టించినట్లవుతుంది. ఇదంతా బాగానే ఉంది గానీ... ఇన్ని గాజులెక్కడ దొరుకుతాయనేగా మీ సందేహం! దాని కోసమేనండీ తపనుండాలని మొదట్లోనే చెప్పింది. ఏ ఫాన్సీ షాపులో అడిగినా, షాపు వాళ్లు మొహం చిట్లించుకోకుండా కావలసినన్ని చిట్లిన గాజులిస్తారు. ఇంకెందుకాలస్యం వెంటనే సిద్ధం కండి మరి.

ఇడియట్

"మీలో ఎవరన్నా ఇడియట్‌లుంటే లేచి నిలబడండి " అన్నాడు కొత్తగా ఉద్యోగంలో చేరిన కుర్ర టీచర్ తొలిసారిగా క్లాసుకు వచ్చి.

ఎవరూ లేవలేదు. కొద్దిసేపటి తరువాత ఒక విద్యార్థి లేచాడు.

"ఏం నీవు ఇడియట్‌వని ఎందుకు అనుకుంటున్నావు"

"లేదు సార్ మీరు ఒక్కరే నిలబడి ఉంటే అందరూ మిమ్మల్ని చూసి గుసగుసలాడుకుంటున్నారు. మిమ్మల్ని కూచోమని చెబుదామని నేను లేచాను సార్".

- ఎంకెఆర్

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...గాలవుడి గురుదక్షిణ పుణ్యమాని మాధవిని పొందిన కాశీరాజు దివోదాసు ఆమెను శాస్త్రోక్తంగా పెళ్లాడాడు. ఒకే ఒక్క మగపిల్లాణ్ని కనిచ్చాక మాధవి తన దారిన తాను పోతుందని చెప్పాక మహారాణి సత్యవతి శాంతించింది. అశ్వమేధ, పుత్రకామేష్టి యాగాల ఫలమయిన యజ్ఞపాయసం రాణులందరికీ దక్కిందికానీ మాధవికి మిగల్లేదు. అయినాసరే 'చక్రవర్తి కాగల కుమారుడు ఈమెవల్ల కలుగుగాక' అని గాలవుడు దీవించాడనే ధైర్యంతో దివోదాసు ఉన్నాడు.

(17వ భాగం)

వెచ్చటి సుగంధజలంతో మాధవికి స్నానం చేయించారు.

మాధవికి ఉల్లిపొర రంగు పట్టుచీర కట్టి "ఇంత అందాన్ని నేనింతవరకూ చూడలేదు" అంది మేఖల.

మాధవి ఎంత నిర్వికారంగా వున్నప్పటికీ ఒక్క క్షణం ఆనందం కలిగింది కానీ ఏమీ అనలేదు.

"నాకే ఇంత ముచ్చట కలుగుతోందంటే ఇక రాజెంత సంతోషిస్తారో" అంది మేఖల.

"ఇక చాల్లే-ఊరుకో" అంది మాధవి.

నగిషీలు చెక్కిన ఇత్తడిపెట్టె తెరిచి మాధవిని అలంకరించడానికి రకరకాల ఆభరణాలను తీసింది మేఖల.

"ఇవేం వద్దు మేఖలా, ఆయనక్కావలసింది శరీరమే కానీ ఇవి కాదు" అంది మాధవి గొంతు తగ్గించి.

"నన్ను శిక్షించాలని చూస్తున్నావా మాధవీ, మిమ్మల్ని నర్వాలంకారాలతో అలంకరించమని రాజాజ్ఞ"

తాను తిరస్కరించి ఆమెకెందుకు శిక్ష పడేలా చేయాలనుకుని అయిష్టంగానే నగలన్నీ ధరించింది మాధవి.

సాంబ్రాణిపొగతో ఆరిన బారెడు జుట్టును అందంగా జడల్లి అందులో పూలమాల తురిమి "మాధవీ, నిజంగా కన్ను చెదిరేలా వున్నావు" అంది మేఖల.

ఇంతలో బయటినుండి ఒక బిడ్డ ఏడ్పు వినిపించగా మాధవి గుండె దడదడలాడి కొడుకు వసుమంతుడు గుర్తొచ్చాడు. 'అచ్చం వసూ ఏడ్పులాగే వుంది. వాణ్ణి ఎవరైనా ఇక్కడికి ఎత్తుకురాలేదు కదా?' అన్పించగా "మేఖలా, ఏడుస్తోంది ఎవరో చూడు.. తొందరగా" అంది.

మేఖల అక్కణ్ణించి లేవకుండానే "మన దాసి పంకజం బిడ్డమ్మా, పాపం ఒంట్లో బాగాలేదు.. అందుకే ఏడుస్తున్నాడు. వాడికిప్పుడు ఆర్నెల్లు" అంది.

'వసుమంతుడికిప్పుడు నాలుగు నెలలు. వాడిప్పుడు కనకాంబరి దగ్గరున్నాడో లేక మహారాణి వద్దనో? తను లేని లోటును గుర్తించాడో లేదో? ఏదేమైనా సుఖసౌఖ్యాలకైతే లోటు రాకుండా పెంచుతాడు మహారాజు. పెరిగి పెద్దయి తండ్రిలాగే రాజవుతాడు. వసూ, నువ్వు బాగా గుర్తొస్తున్నావు నాయనా. నువ్వు మరపుకొచ్చినా బాగుండును తండ్రీ, నేనీ బాధ భరించలేకపోతున్నాను' అనుకుని కళ్ళు మూసుకునేసరికి కంటికొలకుల్లోంచి బిందువులు రాలాయి.

అది చూసిన మేఖల "సంతోషంగా వుండాల్సిన సమయంలో ఈ దుఃఖమేంటి మాధవీ?" అంది.

"ఏంలేదు మేఖలా, ఇక నువ్వెళ్ళు" అంది మాధవి.

"అవున్లేమ్మా, రాజుగారు వస్తుండగా ఇక నా

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

అవసరం ఏముంటుంది?" అని నవ్వి మేఖల వెళ్ళిపోయింది.

మాధవి వెనక్కి వాలి కొడుకును గుర్తుచేసుకుంది. గుప్పిళ్ళు మూసి ఒళ్ళు విరుచుకోవడం, ఏడ్చినపుడు బుగ్గలు ఎర్రబడటం, ఆవురావురుమంటూ తన రొమ్ము పాలు తాగడం - కళ్ళముందు మెదిలి దుఃఖం పొంగుకొచ్చింది.

ఇంతలో దివోదాసు లోపలకొచ్చి తలుపు గడియపెట్టడంతో ఈ లోకంలోకి వచ్చి బాధను దిగమింగుకుంది.

రాజసం ఉట్టిపడుతుండగా రాజు ఆమెకి చేరువగా వచ్చి గట్టిగా కౌగిలించుకుని ముద్దులతో ముంచెత్తాడు.

మాధవి ప్రతిమలా నిలబడిపోయిందే తప్ప ఆమెలో చలనంలేదు. ఎన్నిరకాలుగా ఉద్రేకపరచినా ప్రేరణ లేకపోవడంతో "నువ్వు మరీ మట్టిబొమ్మలా వున్నావేంటి, కాస్తయినా రసికత లేదా? కనీసం ఆనందంగా లేదా" అన్నాడు దివోదాసు.

తాను గాలవుడివెంట బలిపశువుగా బయల్దేరినరోజునే చనిపోయానని, హర్యశ్వుడితో కాపురం చేశానని, ఒక కొడుకు కూడా వున్నాడని, ఈ పరిస్థితి అంతా తుచ్ఛంగా వుందని చెప్పాలని తహతహలాడినా పర్యవసానం ఊహించి తమాయించుకుంది.

చాలాసేపు ఆమె శరీరంతో ఆడుకున్నాక "మాధవీ, ఆరోజు నీకు పాయసం దక్కలేదు కదూ" అన్నాడు రాజు.

"అవును, అప్పటికే అయిపోయింది" బదులిచ్చింది మాధవి.

'ప్చ్' అని రాజు విచారంలో మునిగిపోగా మాధవి పెదాలు దాటకుండా నవ్వుకుంది.

÷÷÷++++÷÷÷

ఆవేళ మేఖల కళ్ళు ఉబ్బి ఎర్రగా వుండటంతో మాధవి పక్కన కూర్చుని "ఏమైంది మేఖలా?" అనడిగింది.

కొద్దిసేపు తటపటాయించినా చివరికి "మా అమ్మను రాజభటులు బాగా కొట్టారమ్మా" అని చెప్పి మళ్ళీ బావురుమని ఏడ్చింది.

మాధవి ఆశ్చర్యపోయి "అయ్యో, అలాగా? రాజుగారికి చెప్పమంటావా, వాళ్ళ అంతు చూస్తారు" అంది.

మేఖల తల అడ్డంగా తాటించింది.

"మేఖలా, నేను మా అమ్మ ముఖమైనా చూడలేదు తెలుసా?! నువ్వు అదృష్టవంతురాలివి, అమ్ముంది.. కానీ ఆవిణ్ణి కొట్టడమేంటి, ఈ మాట తప్పకుండా రాజుగారికి చెప్పాలిందే" అంది మాధవి.

మేఖల ఎవరు వింటారోనని అటూఇటూ భయంగా చూడటంతో సైగచేసి అంతఃపురపు లోపలి గదిలోకి తీసికెళ్ళి "ఇప్పుడు చెప్పు, ఇక్కడికి ఎవరూ రారుగా" అంది.

"నాకో తమ్ముడున్నాడు. మా నాన్న మేం చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మే మమ్మల్ని పెంచి పెద్ద చేసింది. తమ్ముడు సైన్యంలో చేరాలని రాజాజ్ఞ. అయితే వాడికది ఇష్టంలేక తనకు వ్యాపారం చేయాలని వుందని చెప్పాడు. రాజు అందుకు అంగీకరించక సైన్యంలో చేరితీరాలని ఆంక్ష పెట్టారు. దాంతో తమ్ముడు దేశం విడిచి పారిపోయాడు. తమ్ముడు ఎక్కడికి వెళ్ళాడని అమ్మని నిలదీస్తే ఆవిడ తనకేం తెలీదని చెప్పిందట. అప్పుడు భటులు స్త్రీ అని కూడా చూడకుండా ఒళ్ళు హూనమయ్యేలా కొట్టారు. ప్రొద్దున చూసొచ్చాను మాధవీ, శరీరమంతా వాతలు తేలి, వాచిపోయి వుంది" అంటూ ఆమె ఒళ్ళో తల పెట్టుకుని బావురుమంది.

"ఇష్టమైతే చేరతారు, లేకుంటే లేదు, చేరాలని నిర్బంధమేంటి? పైగా అందుకు అమ్మని కొట్టడమేంటి?" అంది మాధవి బాధగా.

"రాజులంటేనే నియంతలు కదమ్మా, రాజాజ్ఞను ప్రశ్నించే హక్కు ప్రజలకెక్కడిది మాధవీ"

"రాచరికమంటే ఇంత నిరసనభావమున్న నువ్వు ఇక్కడెందుకు పనిచేస్తున్నావు మేఖలా?" అంది మాధవి.

మేఖల ఓ క్షణం ఉలిక్కిపడింది. 'మాధవి రాజును ఇష్టపడటం లేదనుకుని ఇదంతా చెప్పింది. తాను పొరబడలేదు కదా, ఈమె రాజు పక్షమే కాబోలు' అని భయపడింది.

"మాట్లాడవే మేఖలా, నాన్న చనిపోయాడు. తమ్ముడు ఇల్లొదిలి వెళ్ళాడు. మరి అమ్మెంత ఒంటరితనంతో బాధపడుతోందో పాపం. కనీసం నువ్వైనా ఆవిడతో వుండొచ్చుగా"

"నాకా స్వేచ్ఛ ఎక్కడిది?"

"అదేంటి?"

"రాజుగారు నన్ను కొనుక్కొచ్చారు"

"ఏమిటీ?"

"అవును... ఒకరోజు మహారాజు వేటనుండి తిరిగొస్తుంటే ఆయన్ని చూడాలనే కుతూహలంతో ఓ గోడెక్కి చూశాను. అదే నేను చేసిన దిద్దుకోలేని తప్పు. ఆయన దృష్టి నామీద పడింది. నేను నచ్చానంటూ నన్ను కొనుక్కున్నారు. ఆ కొనుక్కొచ్చిన రోజున నాతో గడిపారు. ఇక తర్వాత నా ముఖం చూడలేదు" నిర్వేదంగా చెప్పింది మేఖల.

"ఒక్కరోజు భాగ్యానికి నిన్ను కొనుక్కొచ్చారా? అసలు దీనికి మీ అమ్మెలా ఒప్పుకుంది?"

"అంతా తెలిసీఅలా అడుగుతావేంటి మాధవీ?! రాజాజ్ఞను ధిక్కరించిన వాళ్ళ తల నరికి కోటగుమ్మానికి వేళ్ళాడదీస్తారు. రాజు ఆజ్ఞాపించడమే తప్ప అడగడం అంటూ వుండదుగా మాధవీ"

"అయితే నువ్వూ నాలాంటి అభాగ్యురాలివేనా మేఖలా?!" అంటూ కావిలించుకుని తన కథను సంక్షిప్తంగా చెప్పింది మాధవి.

ఇద్దరూ ఒక గూటిపక్షులమే అనుకుని పరస్పరం ఓదార్చుకున్నారు.

"మేఖలా, కనీసం ఈ రాజభవనం నుండి పారిపోవాలనిపించలేదా నీకు?" అనడిగింది మాధవి.

"అనుక్షణం అనిపిస్తుంది. కానీ ప్రయోజనం లేదుగా మాధవీ. వేయికళ్ళతో కాపలా కాసే భటులను ఏమార్చి ఎక్కడికని పారిపోగలను? పైగా ఏ భటుడో దయతలచి వదిలేస్తే నేను దూరంగా వెళ్ళినా ముందుగా వెళ్ళి అమ్మను హింసిస్తారు. అమ్మతో సహా పారిపోయే అవకాశం లేదు మాధవీ"

అది వింటే మాధవికి కడుపు తరుక్కుపోయింది. తనలాంటి దయనీయ స్థితిలోనే వుంది అనుకుని భారంగా నిట్టూర్చింది.

ఒక నిమిషమాగి "ఇక్కడ తిండికి, బట్టకీ మట్టుకు ఏ లోటూ లేదులే మాధవీ" అంది మేఖల.

"ఆ రెండూ వుంటే చాలా?" అడిగింది మాధవి.

"ఆడవాళ్ళకి ఆ రెండూ చాలని సెలవిస్తున్నారుగా"

"కానీ అంతకంటే ముఖ్యమైనవి ప్రేమానుబంధాలు. ఇప్పుడు నా కొడుకుని నాకు అప్పగిస్తే తిండి పెట్టకపోయినా పరవాలేదు. నువ్వు మీ అమ్మచెంతనుంటే వచ్చే ఆనందాన్ని ఎంత ఖరీదైన దుస్తులైనా ఇవ్వగలవా?" అంటూ తనలో తాను గొణుక్కుంది మాధవి.

... ఇంకా ఉంది

తనకు నచ్చిన కన్యలను ఎత్తుకువచ్చే, తన సైన్యంలో చేరకపోతే యువకులను చెరబట్టే దివోదాసు, మాధవి కొడుకుని కనివ్వకపోతే ఊరుకుంటాడా?

దివోదాసు ఆశించినట్లు మాధవి చక్రవర్తి కాగల కొడుకునే కనిస్తే మహారాణి సత్యవతి ఎలా వ్యవహరిస్తుంది?

తప్పించుకు పారిపోదామని ఆలోచన వచ్చిన మాధవి అలా చేయగలిగిందా?

వచ్చే వారం సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె. శివలీల

అర్థరాత్రి దాటినా ఆమెకు ఫోన్‌కాల్స్ వస్తూనే ఉంటాయి. రాంగ్‌కాల్స్‌ను చాలా బాగా రిసీవ్ చేసుకుంటుంది. 'రాంగ్‌కాల్స్‌కు అంత రెస్పాన్సివ్వడం అవసరమా?' అని ఓ రోజు ఉండబట్టలేక అడిగా...

దిల్ హై మేరా... ఫోన్ కాల్ తేరా

"విశాల్...నువ్వు వెయిటింగ్‌లో ఉండవా... మా మమ్మీ నుండి కాల్ వస్తోంది. ఫైవ్ మినిట్స్‌లో మాట్లాడి పెట్టేస్తా. ఓకే...అంటూ 'హాయ్ వరుణ్...' అని మరో కాల్‌ను రిసీవ్ చేసుకుందా అమ్మాయి"

దాదాపు అరగంట గడిచింది

"ఓహ్! గాడ్... డాడీ వెయిటింగ్‌లో ఉన్నారు... రేపిదే టైంకు చెయ్ వరుణ్... బై"

"విశాల్...సారీ యార్... కొంచెం పర్సనల్ ప్రాబ్లం... ప్లీజ్...ట్రై టు అండర్‌స్టాండ్. అసలేమైందంటే విశాల్...మమ్మీ....." అలవోకగా మళ్లీ అబద్ధం...

ఎట్టకేలకు ఈ ఫోన్ల ప్రవాహం సద్దుమణిగింది. చదువుకుందామని బుక్ తీసిందా అమ్మాయి. ఇంతలో...

"దిల్ హై మేరా దీవాన క్యా..." అంటూ మొబైల్ రింగయింది. లిఫ్ట్ చేసింది.

"హలో...సుస్మిత ఉందా..." అంటూ అడుగుతోందో అపరిచితుడి స్వరం.

''రాంగ్ నెంబర్'' అంటూ సమాధానమిచ్చిందా అమ్మాయి.

"మీ వాయిసెక్కడో విన్నట్టుంది. మీ పేరు...'' మాటలు పొడిగించడానికి ప్రయత్నిస్తోందా స్వరం.

ఇప్పుడా అమ్మాయేం చేస్తుంది? 'ఇప్పటివరకూ ఫోన్‌లో మాట్లాడి మాట్లాడీ ఇప్పుడేగా బుక్కు పట్టుకుంది. ఈ సమయంలో మొబైల్ రింగవ్వడమే పెద్ద డిస్టర్బెన్సు. దానికి తోడు రాంగ్ నెంబర్. ఇంకేముంది చడామడా తిట్టి, ఫోన్ కట్ చేసుంటుంది అనుకుంటున్నారా?' అయితే మీరింకా వెనుకటి రోజుల్లోనే ఉన్నారన్న మాట! 'అతను అడిగే ప్రతి ప్రశ్నకీ చలాకీగా జవాబిస్తూ... మరో నాలుగు ప్రశ్నలు వేస్తుంది' అని ఊహిస్తే మీరు సరిగ్గా ఈ తరం ప్రతినిధే ఏంటీ... అంతలా ఆశ్చర్యపోవాల్సిన అవసరమేమీ లేదు... ఈ అమ్మాయే కాదు ఇంకా చాలా మంది యువతరం ప్రతినిధులు "రాంగ్ కాల్స్ వస్తే మేం ఏ మాత్రమూ డిస్టర్బెన్సుగా ఫీలవ్వం" అని చెప్పడం వింటే మీరిక తేరుకోలేరేమో...

"మాది ఖమ్మం. సిఎ కోచింగ్ నిమిత్తం ఇక్కడికొచ్చాను. ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటున్నాను. మా రూమ్మేట్ పీజీ చేస్తుంది. అర్థరాత్రి దాటినా ఆమెకు ఫోన్‌కాల్స్ వస్తూనే ఉంటాయి. రాంగ్‌కాల్స్‌ను చాలా బాగా రిసీవ్ చేసుకుంటుంది. 'రాంగ్‌కాల్స్‌కు అంత రెస్పాన్సివ్వడం అవసరమా?' అని ఓ రోజు ఉండబట్టలేక అడిగా... 'స్వీట్ వాయిస్‌ను ఎలా మిస్ చేసుకుంటాం చెప్పు. నువ్వు చెప్పినట్లు చెడమడా తిడితే నాకింతమంది ఫ్రెండ్సుండేవారు కాదేమో' అని సమాధానమిచ్చింది. రోజంతా ఆమెకు ఫోన్లతోనే సరిపోతుంది. ఇక ఆమెప్పుడు చదువుకుంటుందో... పరీక్షలెలా రాస్తుందో నాకర్థం కాదు" అని చెబుతున్న రాగిణి "ఒక్కోసారి నాకూ ఆ అమ్మాయిలా బోయ్ ఫ్రెండ్సుతో ఫోన్‌లో మాట్లాడుతూ ఎంజాయ్ చేయాలనిపిస్తుంది'' అంటోంది. తోటి వారి ప్రవర్తన పక్కవారినెలా ప్రభావితం చేస్తుందో ఈ మాటలొక నిదర్శనం. "అర్థరాత్రయినా ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంటారు. పక్కవారికి డిస్టర్బెన్సనే ధ్యాసే ఉండదు. ఎవ్వరూ ఆ అమ్మాయిని మందలించరు. ఎందుకంటే వారూ అలాంటి ధోరణినే అనుసరిస్తారు కదా! సెల్ ఫోన్ ఉందంటే దాదాపు ఐదారుగురు బోయ్ ఫ్రెండ్స్ ఉన్నట్లే లెక్క! ఇన్‌ఫాక్ట్ తమ్ముడితో మాట్లాడుతూ వాడిని ప్రేమగా 'ఒరేయ్' అని పిలిచామనుకోండి కచ్చితంగా బోయ్ ఫ్రెండుతో మాట్లాడుతోందనే అనుకుంటారు'' అని అంటోంది సంధ్య.

వాళ్లమ్మా నాన్నలకు తెలిసే ఇలా చేస్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు "తెలిసిన మరుక్షణం ఆ అమ్మాయి కచ్చితంగా సూట్‌కేస్ సర్దాల్సిందే!" అని చెబుతోంది సంధ్య.

చదువుకోవడానికి కేటాయించాల్సిన సమయాన్నిలా సెల్‌ఫోన్ కబుర్లతో గడపడం సమంజసమా? ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే... వారి దృష్టిలో మన స్థానమెక్కడికి చేరుతుంది? ఒకసారి కోల్పోయిన తరువాత వారి నమ్మకాన్ని మనం తిరిగి పొందగలమా? పొందినా... మనల్ని చూసినప్పుడు వారి కళ్లలో క్షణకాలం కదలాడే అనుమానాస్పద రేఖల నుంచి తప్పించుకోగమా? వీటన్నింటినీ కొట్టిపారేసినా... ఎటువంటి పరిచయమూ లేని ఈ వ్యక్తుల వల్ల మనకెటువంటి సమస్యలూ రావని నమ్మకమేంటి? ఒక్కసారి సమస్యల వలలో చిక్కుకుంటే చదువు సాఫీగా సాగుతుందా? ఆశించిన కెరీర్‌ను పొందడం సాధ్యమౌతుందా? ఒక్కసారి ఈ విషయాలన్నీ ఆలోచిస్తే... ఒక నిర్ణయానికి రావడానికి మీరిక ఆలస్యం చేయరేమో. ఎందుకంటే ఆ నిర్ణయం పైనే మీ భవిష్యత్తు ముడిపడి ఉంది మరి!

సినిమా కబుర్లు

చందు

మల్లెమాల సుందర రామిరెడ్డి తెలుగు సినీ గీతాల సాహిత్యాభిమానులకు సుపరిచితులు. అంకుశం, ఆహుతి సినిమా పాటలు ఆయనే రాశారు. పెట్టుబడి పెట్టాకా సంపాదించాల్సిందే కానీ అందుకు దిగజారుడు బండ అక్కర్లేదంటారాయన. అందుకే తన కుమారుడు సినిమా రంగంలో సంపాదించకపోయినా, " నాయనా...డబ్బు కోసం అశ్లీలత, అసభ్యతల మసాలా జోలికి పోకుండా కుటుంబ తరహా చిత్రాలు తీయాలని ఆశీర్వదిస్తున్నాను" అంటున్నారు.

"డెబ్భయి ఒకటిలోనూ పరుగే"

పురాణ పురుషుడు రాముడు నాకు ఆరాధ్య దైవం. అందుకే రామాయణం సినిమా తీయడానికి పూనుకున్నాను. ఇలా తీయాలనుకున్నప్పుడు ఎవరితో తీయాలి. రామారావుని రాముడిగా, రంగారావుగారిని రావణాసురుడిగా చూసిన కంటితో ప్రేక్షకులు ఇంకొకరిని చూస్తారా! అలాగే అలనాటి మేధావులైన సాంకేతిక నిపుణులు లేరిప్పుడు. ఎలా అని ఆలోచిస్తున్నాను. ఆ రోజుల్లోనే గుణశేఖర్ వచ్చి 'పిల్లలతో రామాయణం తీస్తాను సార్' అన్నాడు. పిల్లలతోనా! అని ఒక్కసారిగా షాక్ తిని, ఈ ఐడియా ఏదో కొత్తగా ఉందే అని దీని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. పిల్లలతో తీయలంటే 12 ఏళ్ళలోపు వాళ్ళతో తీయాలి. అంతకంటే వయసుంటే వాళ్ళు పిల్లల్లా కనిపించరు. ఆలోచించాను. 11 ఏళ్ళ కుర్రాడికి వశిష్ఠుడని, విశ్వామిత్రుడని గడ్డం పెడితే నిజమైన వశిష్టుడిగా, విశ్వామిత్రునిగా ప్రేక్షకులు భావిస్తారా అన్న డౌటొచ్చి మద్రాస్ వెళ్ళి కె.యస్. ప్రకాశరావుగారిని కలిశాను. ఆయనకు నేనంటే ఎనలేని గౌరవం. అభిమానపాత్రుడు. ఆయన ఏ విషయాన్నైనా చాలా ఆలోచించి చెబుతాడు. 'రెడ్డిగారు.. మీరు వెలిబుచ్చిన డౌటే నాకూ ఉంది. మొదటి రీల్‌దాకా వాళ్ళు పిల్లలుగా కనబడతారు. ఈ మొదటి రీల్ అయ్యే లోపల మీరు పాత్రల్ని ప్రెజెంట్ చేయగలిగి కథలోకి తీసుకెళ్ళగలిగితే అక్కడి నుంచి ప్రేక్షకులు లీనమైపోతారు. కాకపోతే ఇప్పుడు ఉన్నటువంటి సెట్స్ ఏమీ పనికిరావు. వాళ్ళకు తగ్గట్టు కుర్చీలు, కత్తులు, కిరీటాలు చేయించాలి. చాలా శ్రమతో కూడుకున్న పని' అన్నారు. రామాయణం మీద పెట్టిన 'పెట్టుబడి అంతా పోయినా నేను బాధపడనని జమా ఖర్చులకు అతీతంగా మొదలెట్టాను. ఈ సినిమా తీస్తున్నప్పుడు సెట్లోకొచ్చిన మహానుభావులు ఎవరూ మంచి ప్రయత్నం చేస్తున్నారన్న వాళ్ళు ఒక్కరూ లేరు. దేవుడే మిమ్మల్ని రక్షించాలి.. మీ గుండె ధైర్యానికి ఆశ్చర్యంగా ఉందని అందరూ నిరుత్సాహపరిచారు. మంచి పని చేయబోతుంటే నిరుత్సాహపరుస్తారు. చెడ్డపని చేస్తే విమర్శిస్తారు. మితభాషిని పిరికివాడంటారు. సద్భక్తును పొగరబోతంటారు. సమాజ లక్షణం ఇది. దూషణలను, ఘోషణలను ఏవీ పట్టించుకోను. చిన్నప్పుడు కష్టాలు కర్తవ్యాన్ని నేర్పాయి. దీనిలోంచి ఒక వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాను. అందరి చేత మంచివాడనిపించుకోవడం నా లక్ష్యం కాదు. నేను మంచిగా జీవించడమే. నేను తప్పు చేస్తే అంతరాత్మ హెచ్చరిస్తుంది. అందువలన అంతరాత్మకు లొంగి ఉంటాను.

ఒక్క సినిమాతో దిక్కులు చూస్తున్నాడు

నేను ఆశావాదిని. ఎప్పటికైనా సినిమా ఫీల్డులో కూడా మార్పు వస్తుంది. మాకు ఈ సినిమాలు వద్దు... పాత సినిమాల్లాంటి మంచి చిత్రాలు తీయండని ప్రజలు ఒకే గొంతుతో అరిచే రోజు వస్తుందని ఆశిస్తున్నాను. ఆత్మవిశ్వాసం ఉంది. ఆరోగ్యం ఉంది. ఈ పరుగు పందెంలో వెనక పడిపోయాను. అందుకే నా బాధ్యతను మా అబ్బాయికి అప్పజెప్పాను. వాడు కూడా నాలాగే ఒక క్రమపద్ధతిలో వెళుతున్నాడు. కానీ ఒక్క సినిమా ఫ్లాపుతో దిక్కులు చూస్తున్నాడు. 'అంజి' సినిమా ఆర్థికంగా షాక్ ఇచ్చింది. మనిషి విజయం ద్వారా ఎంత నేర్చుకుంటాడో, అపజయం ద్వారా అంతకంటే పదింతలు నేర్చుకుంటాడు. నా ఆశయాలకు విరుద్ధంగా పోకుండా, డబ్బే ప్రధానం అనుకోకుండా, ఆశ్లీలతకూ, అసభ్యతకూ తావులేకుండా కుటుంబ తరహా చిత్రాలు తీయాలని అభిలషిస్తూ మా అబ్బాయిని ఆశీర్వదిస్తున్నాను.

గమ్యంతో పాటు మార్గమూ ముఖ్యమే

ప్రతి మనిషికీ డబ్బు కావాలి. డబ్బు విలువ నా కన్నా తెలిసినవాళ్ళు ఎవరుంటారు. అన్నం లేక మూడు రోజులు పస్తున్నవాడ్ని. కానీ డబ్బు ఒకటే జీవితం కాదుకదా! కుటుంబం హాయిగా బతకడానికి ఎంత డబ్బు కావాలి? మంచి మార్గంలో మనం పయనిస్తూ ఉంటే చాలా రాళ్ళు మన నెత్తిన పడుతూ ఉంటాయి. రాళ్ళు పడాల్సిందే... మనం వాటిని తట్టుకుని నిలవాల్సిందే. వెనకడుగు వేయకూడదు. గమ్యం ముఖ్యం. అలాగే గమ్యంతో పాటు మార్గం కూడా ముఖ్యం. సినిమాలకు విజయం గమ్యం. మార్గం కథ. ఎంచుకున్న మార్గం సమాజానికి ఉపయోగపడేదిలా ఉండాలి.

ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది

తంగేడు చెక్క, తాటి పీచు, మైకా, పొగాకు, మిరపకాయ, చింతపండు, రైస్... ఒకటేంటి.. చేయని వ్యాపారం లేదు. ఎక్కడ ఏ వస్తువు ఒక రూపాయికి తక్కువకు దొరుకుతుందో అక్కడికి పోయేవాడిని. దీన్ని మార్కెట్లో ఎక్కడ అమ్మితే ఒక రూపాయి లాభం వస్తుందనుకుంటే అక్కడికి వెళ్ళేవాడిని. మనిషిగా రుజువయ్యే వరకు నిద్రని దరి చేరనీయకుండా తరిమికొట్టా. ఇంతచేసి ఏం సాధించానంటే ఏమీ సాధించలేకపోయా. ఏ రంగంలో అయినా మనం నిత్య విద్యార్థులమే. నేర్చుకుంది చాలా స్వల్పం. ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

డెబ్భైఒకటిలో కూడా పరిగెడుతూనే ఉన్నా

నేను చదువుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తే ఎవరూ చేయి అందివ్వలేదు. ఇంకా ఎవరి వద్దా చేయి చాచకూడదని పదకొండో సంవత్సరం నుంచి పరుగు మొదలెట్టాను. కష్టాలు, కన్నీళ్ళను చూసి నేనెపుడూ భయపడలేదు. అటువంటివాటిని ఎదుర్కోవటమే నాకు సంతోషం చిన్నప్పటి నుంచి కూడా. నాకిప్పుడు 71 సంవత్సరాలు. ఇంకా పరిగెడుతూనే ఉన్నా. విశ్రాంతి అంటే ఏమిటో తెలియదు. ఆదివారం అంటే ఏమిటో తెలియదు. పండగంటే, పుట్టిన దినం అంటే ఏమిటో కూడా తెలియదు. నా పుట్టిన దినం నేనెప్పుడూ జరుపుకోనూ లేదు. గుర్తు కూడా పెట్టుకోలేదు. ఒక వ్యక్తి ఎన్ని పుట్టిన రోజులు చేసుకున్నాడన్నది ముఖ్యంకాదు. పుట్టుకను ఎంత వరకు సార్థకం చేసుకున్నాడన్నదే ముఖ్యం.

నా ఆదర్శమూర్తులు

సినిమా పరిశ్రమలోకి రాక పూర్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మహానాయకులందరితో కలసి పనిచేశాను. ప్రకాశం పంతులుగారు, బెజవాడ గోపాలరెడ్డిగారు, నీలం సంజీవరెడ్డిగారు, తెన్నేటి విశ్వనాథంగారు, ఆచార్య రంగాగారు ... ఇలా మహామహులందరితో కలసి తిరిగాను. ఇటువంటి మహానాయకుల అడుగుజాడల్లో నడవడం మహాభాగ్యంగా భావించేవాడ్ని. నాకు చేతనైనంత వరకు ప్రజా సేవలో పాలుపంచుకున్నాను. మహాత్మాగాంధీ నాయకత్వంలో భారతీయ స్వాతంత్రోద్యమం బలీయంగా జరుగుతున్న రోజులవి. నా పదో ఏట నుంచీ గాంధీజీ మార్గాన్ని అనుసరిస్తున్నాను. నాకు రాజకీయ రంగంలో గాంధీజీ, పౌరాణికంగా రాముడు ఆదర్శమూర్తులు.

వచ్చే వారం "భక్త రామదాసు" సినిమా గురించి

చిన్నారి చిత్రకారులు



మేం చెప్పిన రంగులద్దండే

1. RED 2. YELLOW 3. GREEN
4. BLUE 5. BROWN

5 తేడాలు ఏవి?

చుక్కలు కలిపేద్దాం



కత్తిరించండి - అతికించండి



హేయ్ నేస్తాలూ! కింద కొన్ని ఆకారాలు వున్నాయికదా. ముందు వాటికి అక్కడ రాసి వున్న రంగులద్దండి. తర్వాత కత్తిరించండి. ఆ తర్వాత పైన ఒక చిన్ని బొమ్మ వుందికదా. అలా అతికించండి. అదిరిపోతుంది.





వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదేంటో తెలుసా! అవును. అది ఒక రాష్ట్ర మేప్., అది ఏ రాష్ట్రానిదో చెప్పాల్సింది మీరే. ఇప్పుడే చెప్పేస్తారా! వద్దులే. మీరు ఏంచేస్తారంటే... వెంటనే యమ అర్జంటుగా ఒక కార్డు తీసుకోండి. దాని మీద సమాధానం రాసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

23.10.05 సమాధానం: ఇందిరాగాంధీ

16.10.05కు సరైన సమాధానాలు రాసినవారు

ఎం. దుర్గాప్రసాద్, 10వ తరగతి, ఆర్.ఆర్.స్కూల్, పిఠాపురం, తూ.గో. బి. అఖిల్వ, 4వ తరగతి, ప్రాథమిక పాఠశాల, బైంసా, ఆదిలాబాద్. ముప్పిడి పూజితారాణి, 8వ తరగతి, రాధా కృష్ణా స్కూలు, కొవ్వూరు, ప.గో. పి. భాగ్య, 9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధన్‌వాడ, మహబూబ్‌నగర్. చిలకలపూడి హారిక, 4వ తరగతి, ఎస్‌టిఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్. ఎం.సబిత, 8వ తరగతి, బందిమెట్ట, కర్నూల్. ఎ.సాహిత్య లోహిత, 4వ తరగతి, ఎ.శరత్ చంద్ర, 2వ తరగతి, పాలకొల్లు. ఎల్.స్రవంతి, 8వ తరగతి, నవోదయ విద్యాలయం, మద్దిపాడు, ప్రకాశం. ఎస్.వాసు, వి.సంతోష్, ఎం.నరసింహారావు, టి.మహేష్, వై.అప్పారావు, టి.రామారావు, తిరుపతిరావు, వంశీ, 10వ తరగతి, ఎస్.వి.జి.ఎస్ పబ్లిక్ స్కూల్, బోనకల్, ఖమ్మం. షేక్ అమీనా, 10వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, అన్నారుగూడెం, ఖమ్మం. కె.వెంకటేష్ వర్మ, 9వ తరగతి, జడ్‌పిఎస్ఎస్ స్కూల్, చంద్రుగొండ, ఖమ్మం. జి.సాయిభరత్‌రెడ్డి, 7వ తరగతి, మోదుకూరు, కె.శ్రీ తన్మయ, 3వ తరగతి, గుంటూరు. ఎం.వి.ఎస్.ఎస్.బాలాజీ, 6వ తరగతి, సెంట్ ఫ్రాన్సిస్ హైస్కూల్, పోలవరం, తూ.గో. మాదాల గోపి, 7వ తరగతి, ఎం.మనోహర్, 7వ తరగతి, వేల్పూరు, గుంటూరు. బి.వీరప్రతాప్, 9వ తరగతి, గురుకుల పాఠశాల, పాల్వంచ, ఖమ్మం.

అమ్మో ....సింహం!



బుజ్జాయిలూ! పైన సింహం వుంది కదూ. మీకు దాన్ని చూస్తుంటే ఏమనిపిస్తోంది? 'ఆ... అది పాపం బాగా ముసలిదైపోయింది. అందుకే నడవలేక గోళ్లతో ఇసుకలో గీరుతూ పాకుతోంది' అంటున్నారు ఎక్కువమంది నేస్తాలు. మరి మిగతా వారు కూడా అదే అనుకుంటున్నారా! అలా అయితే మీరంతా ఇసుకలో కాలేసినట్టే. ఇలా ఎందుకంటున్నామంటే... ఈ బొమ్మను ఇసుకతో చేశారు కాబట్టే. ఏంటి అంతలా ఆశ్చర్యపోతున్నారు. నిజం ఇది ఇసుక సింహం.

అట్టమీది కథ

టూరింగ్ నుండి ఐ-మాక్స్

ఉదయశంకర్



చిన్నా పెద్దా ఆడా మగ పేదా గొప్పా ఎవరనేది తేడా లేకుండా అందరికీ చాలా అందుబాటులో వచ్చిన వినోద సాధనం సినిమా. మరి వాటిని ప్రదర్శించేది సినిమా హాళ్లు. ఈ సినిమాలకు కావాల్సినది మహిళాప్రేక్షకులు. దానికి తగ్గట్టుగానే సినిమాహాళ్లు కూడా మహిళలకు అనుగుణమైన సమయాలు కూడా నిర్ణయించడం గమనించవచ్చు. ఇంటిల్లిపాదికీ అన్ని సర్ది ఆఫీసులకు, స్కూళ్లకు పంపాల్సినవాళ్లను పంపి ఖాళీ అయిన గృహిణి కోసం నూన్ షోలుగా 11గంటల ఆటలు మొదలెట్టింది అందుకోసమేనంటారు. ఆ దశకూడా దాటి హోమ్ థియేటర్లు కూడా వచ్చేశాయనుకోండి. ఒకనాటి డేరాల్లో ప్రదర్శించిన టూరింగ్ టాకీస్‌ల నుండి నేటి ఐ-మాక్స్ థియేటర్ల వరకూ సినిమాహాళ్లలో ఎన్నెన్ని మార్పులో...

సినిమా ఆవిర్భావం, దాని అభివృద్ధి కోసం కృషిచేసిన మహామహుల సంగతి కాసేపు అలా పక్కనుంచినా, సినిమా అభివృద్ధిలో కీలకమైన పాత్ర వహించే వాళ్లు మాత్రం ముమ్మాటికీ సినిమాహాళ్లవారు, ప్రేక్షకులే. వ్యామోహం అనే మాట కూడా పక్కనుంచితే...గంటల తరబడి లైన్లలో నిలబడి, అవసరమైతే బ్లాకులో టిక్కెట్లుకొని జనం చెక్కుతున్నారు. "వందరోజులు ఈ బొమ్మ ఆడిందిరా" అనే బాక్సాఫీస్ హిట్లు ఇచ్చేది ప్రేక్షకులే. శ్రీమంతులకే కాకుండా సామాన్య ప్రజల వరకూ అందరికీ సినిమా అనే వినోదాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత టూరింగ్ టాకీస్ స్థాయి నుండి నేటి ఐమాక్స్ థియేటర్ల స్థాయి వరకూ అభివృద్ధి చేసిన ఎగ్జిబిటర్లే. యజమాని నుండి టిక్కెట్టు చింపే గేటుమేన్ వరకూ సినిమాహాలు వారే. అస్సలీ సినిమాహాళ్లెలా వచ్చాయి తల్లో...అంటే అందుకు చాలా పురాణం ఉందక్కయ్యా అనాల్సొస్తుంది మరి!

నాటి మాయాలాంతరు

మాయాలాంతరు పెట్టె...టూరింగ్ టాకీసు డేరాలు

మనం పదేపదే సినిమా సినిమా అంటున్నామే...అసలు ఈ సినిమా అనే పదం "కినిమా" అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. గ్రీకువీరుల ఈ మాటకు అర్థం "ముందుకు కదిలే బొమ్మ" అని. సరిగ్గా నూటతొమ్మిదేళ్ల క్రితం 1896 జులై 7. బొంబాయి నగర వాట్సన్ హోటల్‌లో భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా గుడ్డతెర మీద బొమ్మలు కదిలాడి, ప్రజల్ని "వారేవ్వా ఏందిరో ఇది" అని ముక్కున వేలేయించిన రోజది. లూయీ లుమియర్, ఆగాస్ట్ లూమియర్ (లూమియర్ సోదరులు) "సినిమాటోగ్రాఫ్" ద్వారా మాటలులేని మూకీ చిత్రాన్ని ప్రదర్శించారు. సాయంత్రం ఆరుగంటలకు, రాత్రి ఏడు, తొమ్మిది, పది గంటలకు ప్రత్యేక ప్రదర్శనలు వేశారు. టిక్కెట్టు ఆరోజుల్లో ఒకరూపాయి. మహిళలు చూడ్డానికి ప్రత్యేకంగా 'జనానా షో'లు వేసేవారు. సామాన్యజనం కోసం 'బారానావాలా'(నాలుగణాల) టిక్కెట్లు పెట్టారు. అదో అద్భుత వింతగా తోచింది. దాంతో "బయస్కోపు" అనే పేరు దేశమంతా మార్మోగిపోయింది. ఈ అద్భుతాన్ని మనమెందుకు సాధించలేం అనే ఆలోచన మనవాళ్లకు కలిగిందండి అది చూశాక. ఆ ఆలోచనకు ముందుగా కదిలింది మన తెలుగువాడేనండీ. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్టణంలో ఉండే రఘుపతి వెంకయ్యకు ఫొటోగ్రఫీ అంటే మహాపిచ్చి. ఆ ఫొటోగ్రఫీ ఇంకా బాగా నేర్చేసుకున్న మన వెంకయ్యగారు సినిమా గురించి కూడా తెలుసుకున్నారు. తెలుసుకున్నాక ఊరుకుంటారా చెప్పండమ్మల్లారా...1908లో విదేశాల నుంచి క్రోనో మెగాఫోన్ తెప్పించారు. మద్రాసులో విక్టోరియా పబ్లిక్ హాలులో మూడు, నాలుగు వందల అడుగుల నిడివి ఉండే చిన్నచిన్న సినిమాలు ఆడించారు. ఆ తరువాత ఈ మహానుభావుడే అనేక చోట్ల గుడారాలు, డేరాలు వేయించి టూరింగ్ సినిమాహాలుగా తాత్కాలిక సినిమాటాకీస్ ఏర్పాటు చేసి సినిమాలు ఆడించారు. అవండీ మన మొట్టమొదటి కినిమాలు...అదేలేండి సినిమాలు.

అలాంటి టూరింగ్ సినిమాలు గురించి గుర్తొస్తే మా తాత చెప్పే ఆయన చిన్ననాటి సంగతి గుర్తొస్తుంది. పొద్దంతా పొలంలో ఎండపొడన పనిచేసిన ఆయనగారు ఐదు కోసుల దూరంలో ఉన్న టౌనులో టూరింగ్ డేరా వేశారని విన్నాడు. అందులో ఏదో సినిమా ఏస్తన్నారని తెలిసి లగెత్తుకెళ్లాడు. నేల టిక్కెట్టు అర్ధణా(మూడు పైసలు). పొలంలో బండెడుచాకిరీ చేసే మనిషికదా...అందర్నీ తన బుజాల్తో తోసి ఆవతలకి నెట్టేసిమరీ కిటికీ దగ్గరకెళ్లి టిక్కెట్టు దొరకపుచ్చుకున్నాడు.

రాష్ట్రంలోనే రెండవ థియేటర్



కృష్ణాజిల్లా బందరు పట్టణంలో ఎంతో పురాతనమైన థియేటర్ 'మినర్వా' రాష్ట్రంలోనే రెండవ థియేటర్ కావడం విశేషం. 1925వ సంవత్సరంలో ప్రారంభమైన దీని వ్యవస్థాపకులైన పి.వి.దాసు, తోటి పార్టనర్స్ కూనపరెడ్డి రాఘవయ్యనాయుడు, కొల్లిపర రమణయ్య, కోట రామబ్రహ్మంలతో థియేటర్ అభివృద్ధి చేయుటకు అహర్నిశలు కృషి చేశారు. అంతేకాకుండా ఆంధ్రనాటక కళా పరిషత్ నాటకాలకు వేదికగా మినర్వా నాడు నిలిచింది. దాదాపు 580 సీట్లు కలిగిన ఈ థియేటర్‌లో పాతాళభైరవి, గులేబకావళికథ, దేవదాసు తదితర ఎన్నో చిత్రాలు స్వర్ణోత్సవాలు జరుపుకున్నాయి. అప్పట్లో మినర్వా ఫౌండర్ అయిన దాస్‌కు చిత్ర పరిశ్రమలో మంచి ఖ్యాతి ఉంది. దీంతో ఆయన బందరు పట్టణానికి మంచి చిత్రాలను తీసుకురావడానికి ప్రోత్సహించేవారు. బందరులో హిట్ అయితే చాలు... అది ఫిలిం ఇండస్ట్రీ అంతా వ్యాపించి ఆ చిత్రం విజయానికి తార్కాణ మయ్యేది. అందుకే ముఖ్యంగా కొంతమంది సినీ ప్రముఖులు బందరులో నూతన సినిమా ప్రదర్శించిన రోజున ముంబాయి నుండి ఫోన్ చేసి 'సినిమా ఎలా ఉంది' అని అడిగి తెలుసుకునేవారట.

మళ్లీ పరుగెత్తుకెళ్లి టిక్కెట్టు చింపించుకుని లోపలకి జొరబడ్డాడు. నేలక్లాసంటే నేలేమరి. పొడి ఇసుక జల్లారు. ఆ క్లాసులో చివరాకర్న కూసోని, తన ముందేపు, అటుపక్క, ఇటుపక్క కాండ్రించి ఉమ్మేశాడు. ఆ శ్లేష్మం అర్ధగజం బారున పడింది. ఇకంతే దాని దరిదాపుల్లో ఎవరూ కూర్చోలేరు కదా...తాతగారు ఎంచక్కా బాసింపట్లేసుకుని కూర్చుని, జంతికలు కొనుక్కొచ్చుకుని కరకర తింటూ సినిమా చూశాట్ట. అలాంటాయనే ఒకాయన పొలంగట్టున తాటిస్తూ నడిచే పొన్నుగర్రతో సహా సినిమాకి వెళ్లాడంట. చూస్తున్న సినిమాలో ఒక గుర్రం మీదకొచ్చేస్తోంది. అంతే ఆ పెద్దమనిషి "ఛైఛై...వోసినీయవ్వ మీదకొత్తదేరా" అంటూ తన పొన్నుగర్రతో తెరమీద ఒక్కటిచ్చుకున్నాడంట. ఇలాంటి విచిత్రాలు ఇప్పటివాళ్లకు కథలయ్యాయి.

నేటి సర్కస్ డేరాల్లాగా ఊరి శివార్లలో గుడారాలు దించి "సింప్లెక్స్ ప్రొజెక్టర్" ద్వారా మాటల్లేని సినిమా వేసేవారు. ఈ డేరాల వాళ్లకు పోటీగా, ఖాళీగా ఉన్న రైసుమిల్లుల్లోనో, ధాన్యంగోడౌనుల్లోనో వేసే సినిమావాళ్లకు భలే పోటీ నడిచేది. ఆ పోటీ తట్టుకోవడానికి ప్రొజెక్టర్ల ముందు రంగుటద్దాలు పెట్టి, ప్రేక్షకుల్ని తన్మయుల్ని చేసేవారు. మరికొంతమంది ఏంచేసేవారంటే...మంచి మాటకారులను, జోక్స్ పేల్చేవాళ్లను, మంచి గొంతున్నవాళ్లను పెట్టి కథాకథనం చెప్పించేవారు. ఆ సినిమాకి అనుగుణంగా తెర పక్కనో, వెనుకనో నిలబడి రేకు బూరతో పెద్దగొంతుతో కథ, అక్కడక్కడా డైలాగులు కల్పించి చెప్పేవారు. కస్తూరి శివరావు, కాళ్లకూరి సదాశివరావు లాంటివారు బూరల్లో తెరపక్కనుండి మాటలు చెప్పేవారు. ఇలాంటి పేరున్న వాళ్లు కామెంటరీ చెబుతున్నారని ప్రచారంలో కూడా చెప్పేవారు. ఫలానా సినిమా వేస్తున్నామని డప్పు చాటింపు ఊరంతా వేయించేవారు. కొంతకాలానికి ఈ టూరింగ్ టాకీస్‌లో వ్యాఖ్యానంతో పాటు వేణుగానం, తబలా, హార్మోనియం లాంటి వాయిద్యాలు కూడా జతచేశారు. ఒకే ప్రొజెక్టరవ్వడం వల్ల రీలు మార్చే టైం లో ప్రేక్షకులకు ఖాళీ దొరికేది కదా...ఇక చూస్కోండి. డేరా హాల్లో ఈలలు, గోలీసోడాల ఖయ్యీమనీ చప్పుళ్లు, వెంట తెచ్చుకున్నవో, విరామాల్లో గేటు దగ్గరకెళ్లి కొనుక్కు తెచ్చుకున్నవో చేగోడీలు, జంతికలు. శనక్కాయలు తింటూ, ఒకర్నొకరు పలకరింపులు, అప్పటివరకూ సాగిన సినిమా కథ, డైలాగులు చెప్పుకోడాలు ఇలా ఒక కోలాహలం. కొన్ని టూరింగ్ టాకీస్‌లలో ఇలాంటి విరామాలలో కూడా ప్రేక్షకులు పెద్దగా గొడవ చేయకుండా ఉండేందుకు నృత్యప్రదర్శనలేర్పాటు చేసేవారు. ఆ డ్యాన్సుకళాకారులకు కూడా విపరీతమైన క్రేజ్ ఉండేది. సురభి కమలాబాయి, రాంప్యారీ, అంజనీబాయి లాంటి పేరున్న కళాకారులు ఇలా కృషిచేసినవారే. 1930ల నుంచి ఈ టూరింగ్ టాకీస్‌లకు మరింత కలెక్షన్లు పెరిగాయి. అప్పుడు మన రాష్ట్రంలో వరి విపరీతంగా పండేది. దానితో రైసుమిల్లులు పెరిగాయి. వాటి వల్ల ఆయిల్ఇంజన్ల సంఖ్య పెరిగింది. వీటితో కరెంటు పెరగటంతో కార్బయిడ్ గ్యాస్ లైట్ల స్థానంలో ఆర్క్‌లైట్లు వచ్చాయి. తెరమీది బొమ్మ మరింత స్పష్టంగా, ఆహ్లాదంగా కనబడేవి. ఇక చూస్కోండి...సంభ్రమాశ్చర్యంతో సినిమాహాళ్లు కొత్త పుంతలు తొడిగాయి. దీనికి తోడుగా 1931 మార్చి 14వ తేదీ నుంచి తెరమీది బొమ్మ మాట్లాడ్డం మొదలెట్టింది. "ఆలంఆరా" అనే హిందీ సినిమాతో టాకీ సినిమాలు వచ్చాయి.

డేరా నుంచి డిజిటల్ సినిమాహాల్

ఆ బందరు పెద్దమనిషున్నాడు చూడండక్కయ్యగారూ... ఆయనేనమ్మా...రఘుపతి వెంకయ్యనాయుడు గారు, ఫొటోగ్రఫీ నుంచి సినిమా విషయాలుకూడా నేర్చేసుకున్నారే అయన. మద్రాసులో "గెయిటీ థియేటర్" 1912లో కట్టించారు. అది మొదలు మౌంట్‌స్ట్రీట్‌లో "క్రౌన్ థియేటర్", పరశువాకంలో "గ్లోబ్" ఇలా ఒకదానివెంట ఒకటి సినిమా హాళ్లు తెగ వెలిశాయి.

ఆ రోజుల్లోనే సి పుల్లయ్యగారు కాకినాడ నుంచి బొంబాయి వెళ్లి సినిమా తీయడం గురించి నేర్చుకున్నార్టండీ. 1924లో మళ్లీ కాకినాడ తిరిగొచ్చి భక్తమార్కండేయ మూకీ సినిమా తీశారు. వాళ్లిల్లే సినిమా స్టుడియో. షూటింగయ్యాక ఆ ఫిల్మ్‌ని కుడితి గంగాళంలో కడిగి, ఎండబెట్టి, పెట్రొమాక్స్ లైట్ కాంతితో ప్రింట్లు వేసేవారు. అంత కష్టపడ్డాడండీ ఆ మహాత్ముడు. ఆయన దగ్గరున్న "ఓపెన్ ప్రొజెక్టర్"కి, సౌండ్ సిస్టమ్‌ను తగిలించి సూర్యకాంతి సహాయంతో గోడమీద సినిమా వేసుకుని చూసేవారు. టిక్కెట్టు పెట్టలేదు గానీ రాష్ట్రంలో మొట్టమొదటి సినిమా హాలు సి పుల్లయ్యగారిల్లే. కానీ ఆ



నాటి మద్రాసు గ్లోబ్ థియేటర్



నాడు డేరా... నేడు హాల్

గుంటూరు నగరంలో ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు 1926లో టూరింగ్ టాకీస్ నిర్మించారు. నాడు డేరా సినిమా హాల్‌గా పిలిచిన ఈ థియేటర్ 1951 నుండి రాధాకృష్ణ థియేటర్‌గా మారింది. డేరా సినిమాని బాంబేసేఠ్‌లు నిర్వహించారు. సినిమా థియేటర్‌లు డిజిటల్, ఐమాక్స్ థియేటర్‌లుగా రూపాంతరం చెందుతున్న ప్రస్తుత తరుణంలో కూడా రాధాకృష్ణ హాల్లో పెద్దమార్పులు లేవు. 1951 తరువాత కొద్దిమేర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. పాత కాలంలో సినిమా మారిందంటే చాలు ప్రజలు తండోపతండాలుగా హాల్‌కు వచ్చేవారు. ఆ సమయంలో కుర్చీలు, బెంచీలు ఉండేవి కావు. విఠలాచార్య దర్శకత్వం వహించిన సినిమాలు అప్పట్లో ప్రేక్షకుల్లో ప్రత్యేకతను నిలిపేవి. ఆ సినిమాలను ప్రేక్షకులు ఆసక్తిగా చూసేవారు. తరువాత ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్ చిత్రాలు కథాబలంతో రావడం, అశ్లీలతకు దూరంగా ఉండటంతో ప్రజాదరణ పొందేవి. సినిమాల వల్ల థియేటర్ యజమాని ఎప్పుడూ నష్టపోలేదు. ఇప్పటిలాగా అప్పుడు నాలుగు ఆటలు ఉండేవి కావు. సినిమా థియేటర్‌కు గోడలు బదులు తడికెలు ఉండేవి. ఒక్కోసారి జనం ఎక్కువైతే తడికెలను తీసేసేవారు. ప్రొజెక్టర్ కూడా చాలా పెద్దదిగా ఉండేది. కరెంట్ పోయినపుడు ట్రాక్టర్ తీసుకొచ్చి దాని ఇంజన్ ద్వారా సినిమాను ఆడించేవారు. అప్పుడు 28 రీళ్ల సినిమా మూడున్నర గంటలను ప్రదర్శించేవారు.



స్త్రీ, పురుష ప్రేక్షకుల మధ్య వెదురు బొంగును ఏర్పాటు చెసేవారు. లాబాల బాటలో నడిచే సినిమా రంగం కేబుల్ టి.వి రాకతో అట్టడుగు స్థాయికి చేరుకుంది. ప్రేక్షకుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రయివేటు టీవి ఛానళ్లు పెరగటం, వాటిలో సీరియల్స్ ప్రసారం కారణంగా సినిమాలకు మహిళా ప్రేక్షకుల సంఖ్య అనూహ్యంగా తగ్గింది. మంచి సినిమా వస్తేకాని థియేటర్‌కు రాని పరిస్థితి నేడు నెలకొంది.

ఎం. సాంబశివరావు, గుంటూరు

ప్రతిష్ట విజయవాడలోని పోతిన శ్రీనివాసరావు నిర్మించిన "మారుతీ థియేటర్" కొట్టేసింది. ఆ తరువాత రాష్ట్రంలో రెండవ థియేటర్ మచిలీపట్టణంలోని పివి దాస్ మరికొంతమంది పార్టనర్స్ కలిసి "మినర్వా సినిమా థియేటర్" నిర్మించారు. ఇలా అనేక థియేటర్లు రాష్ట్రమంతటా వెలిశాక సినిమా అనేది సామాన్యులకు చాలా అందుబాటులోకి వచ్చేసింది. ఇదొక పెనువ్యాపారమయ్యాక ప్రేక్షకుల్ని అకట్టుకోవడం ఒక తప్పనిసరి. ఆ తప్పనిసరి అనేక మార్పులకు క్లాప్ కొట్టింది. మామూలు ప్రొజెక్టరు, మామూలు సౌండ్ సిస్టమ్‌లతో అతిసాధారణ ప్రదర్శనలుగా సాగేవి. ప్రపంచంలో వస్తున్న సాంకేతికమార్పులు మన దేశానికి కూడా నెమ్మదిగానైనా ఒకటొకటిగా వచ్చి చేరుతున్నాయి. స్టీరియోఫోనిక్ సౌండ్ అటు ఫిల్మ్ పక్కన సౌండ్‌ట్రాక్‌మీద ఉన్నా...ఆ సౌండ్‌సిస్టమ్ హాలుకి కూడా ఏర్పాటు చేయాలి. దానితో 'మా హాలు స్టీరియోఫోనిక్ ఎఫెక్ట్‌లు ఏర్పాటుచేశామహో' అనే బోర్డు తగిలించిమరీ ప్రేక్షకుల్ని ఆకర్షించుకున్నారు. అవి పెట్టలేనివారు బందరుటౌన్‌లో నవకళా థియేటర్‌లోలాగా సౌండ్ బాక్స్‌లు హాలులోపల చుట్టూతా ఏర్పాటుచేసి స్విచ్ ఆన్ & ఆఫ్‌లతో ఆ బాక్స్‌ల వరకూ ప్రొజెక్టర్ ఆపరేటర్ పనితనంతో ఆ స్టీరియో ఎఫెక్ట్‌ని కలుగజేశారు. 35ఎంఎం సినిమాలు తరువాత 70ఎంఎం ఇంగ్లీషు సినిమాలుగా "మెకన్నాస్ గోల్డ్" లాంటివి వచ్చాక తెలుగులో కూడా హీరో కృష్ణ "మోసగాళ్లకు మోసగాడు" సినిమా చివరి క్లయిమాక్స్ రెండురీళ్లు 70ఎంఎం, సినిమాస్కోపులో రావడం మొదలైంది. అందుకోసం సినిమాహాళ్లలో తెరను పెద్దదిగా చేసుకోవడం, మేలైన లెన్సులు అమర్చడం చేశారు. హాలులో కూర్చున్న వారు మంచి అనుభూతి పొందేలా చేయడం కోసం సినిమాహాళ్లు హైటెక్ పద్ధతులన్నెంటినో జోడించుకున్నాయి. స్టీరియో సౌండ్ సిస్టమే ఓ వింత అనుకుంటే...డిటియస్ సౌండ్ సిస్టమ్‌లో అది మరింత వింతగొలిపింది. చూసే సినిమాలో ఏదన్నా వస్తువు గిరాటేస్తే, లేదా ఏదన్నా కారో, రైలో, విమానమో వెళ్తున్న సన్నివేశంలో శబ్దం కూడా మన వెనుకనుంచి, మన మీంచి, మననుంచి దూరంగా వెళ్లుతున్నట్లుగా వినిపిస్తుంది. దీన్ని కూడా తమ హాలు గొప్పదనంగా 'డిటియస్ ఎక్విప్‌డ్' అని బోర్డులో పెట్టారు. హాలీవుడ్ దార్శనికుడు, నిర్మాత జార్జి లూకస్ స్పెషల్ ఎఫెక్టుల హంగులతో "స్టార్‌వార్స్" అనే సినిమా తీశాడు. ఈ సినిమాతో సాంప్రదాయ రసాయినాలతో తయారయ్యే సెల్యులాయిడ్ సినిమాను ఒక్కసారిగా డిజిటల్ సినిమా థియేటర్ ప్రపంచానికి తెరతీశాడు. డిజిటల్ సినిమా థియేటరు వారు 4096×2160 పిక్సెల్స్ రెజల్యూషన్ ఉన్న 4కె డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా వేసే సినిమా ప్రస్తుతం మనం చూస్తున్న తెరమీది బొమ్మకి నాలుగు రెట్లు పెద్దదిగా, కాంతివంతంగా కనబడుతుంది.

అరవైవేల డాలర్ల(రూ.32,24,000/-) ఖరీదు చేసే ఈ డిజిటల్ ప్రొజెక్టర్ ఉన్న ఈ హాలు వారు ఉపగ్రహం ఛానెల్ ద్వారా తమ కంప్యూటర్ సర్వర్‌లోకి సినిమా డౌన్‌లోడ్ చేసుకున్నాక మనం చూసే తెరమీద చూపెడతారు. ప్రపంచమంతా దాదాపు 250 డిజిటల్ థియేటర్లుంటే అమెరికా, కెనాడాల్లోనే 90 ఉన్నాయంట. వార్నర్ బ్రదర్స్, సోనీ, డిస్నీ తదితర సినీమహావ్యాపార సంస్థలు 1,500 డిజిటల్ సినిమాహాళ్లు పెట్టాలని వాణిజ్య ఒప్పందాలు, ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. "పివిఆర్ సినిమాస్" అనే అలాంటి మహా సంస్థ మన దేశంలో కొన్నిచోట్ల తన సినిమా థియేటర్లు పెట్టేసింది. మన రాష్ట్రంలో హైదరాబాద్ పంజాగుట్ట సెంటర్‌లోని సిటీ సెంట్రల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పెట్టాలనుకున్నారు కానీ అనుమతిపర అడ్డంకులతో ఆగివుంది. ఈ సర్వ హంగులూ, మాయలూ మించిన మహామాయ ఇప్పుడొచ్చేసింది. అదే...ఐ-మాక్స్ థియేటర్.

అయ్యారే...ఐ మాక్స్ అదిరిందిరోయ్!

మన రాష్ట్రంలోకే కాదు... దక్షిణభారతదేశానికే మొట్టమొదటి ఐ మాక్స్ థియేటర్ హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లక్స్ ఐమాక్స్ సినిమాహాలు. ముందు ఆహమ్మదాబాద్‌లో, తరువాత ముంబయిలో, మూడవది మన హైదరాబాద్‌లోదే. ఇప్పటి సినిమాహాళ్లు కేవలం ఒక్క సినిమా చూడ్డానికే కాదండక్కయ్యగారూ...రెడీమేడ్ బట్టలు, బంగారు అభరణాలు, పాదరక్షలు, డ్రింకులు, వినోదక్రీడలు, రకరకాల ఫాస్ట్‌ఫుడ్డులు ఇలా వ్యాపారసముదాయం మధ్య సినిమాహాలుంటుందండీ...సింపుల్‌గా ఇంద్రభవనమో, ధర్మరాజు రాజసూయయాగ మయసభో... వాటి జేజమ్మల్లాగా హాలు అదిరిపోద్ది మరి!

ఐ మాక్స్ అంటే...'మాక్సిమమ్ వ్యూ ఫర్ ఐ'. మన కన్ను చూడగలిగినంత మేర దృశ్యం ఎంతో సాంకేతిక అద్భుతాలతో చూడవచ్చు. ఇది న్యూయార్క్, టొరెంటోలలో ఉన్న కంపెనీ ఐమాక్స్ కంపెనీవారి ఆవిష్కరణ. వీళ్లు ఇదివరకు టి-రెక్స్, ఐలెండ్ ఆఫ్ షార్క్ అనే సినిమాలు తీసి ప్రపంచం మీదకు వదిలినవారు కూడా. ఈ ఐమాక్స్ సినిమాహాలుని మన ఎల్‌వి ప్రసాద్‌గారి వంశీకులు రమేష్ ప్రసాద్, సాయి ప్రసాద్‌లు నెలకొల్పారు. 635 సీట్లున్న మాక్స్ థియేటర్ 70ఎంఎం స్రీన్ మీద 61.5కోట్ల ఖరీదైన ప్రొజెక్టర్‌తో సినిమా ప్రదర్శిస్తారు. ఈ సినిమా బొమ్మ మనం సహజంగా చూసే 35 ఎంఎం కి పదిరెట్లు, 70 ఎంఎం కి మూడురెట్లు పెద్దది. దీని తెర 29మీటర్ల వెడల్పు, 21.93 మీటర్ల ఎత్తుండి ఏటవాలుగా ప్రేక్షకుల మీదకు ఒంగినట్లుంటుంది. అలాంటి స్క్రీన్‌మీదనుంచి ఏ "షార్క్" సినిమానో 3డి లో చూశామంటే... ఓహ్...చెప్పలేం. ఇదండీ సినిమాహాళ్ల పురాణం. ఇలా చెప్పుకుంటూ పోతే తరగదు, ముగియదు. ఈ సినిమాహాళ్ల పరిణామం ఇంకా ఎన్నెన్ని మార్పులు చేర్చుకుంటుందో మరి. వేచి చూద్దాం. అప్పటి వరకు ఈ సినీమాయా లాంతరు పెట్టె, దాని హాళ్ల విన్నూత్న ప్రయోగాలనూ, వాటి వింతవింత ఆవిష్కరణలను ఆస్వాదిద్దాం.

తెలుగునాట తొలి సినిమా థియేటర్ 'మారుతీ'

నాటకాలకేగాక సినిమా ప్రదర్శనకు, పంపిణీకి కూడా విజయవాడ నగరం కేంద్ర బిందువు. ఆ రోజులలో ప్రధానమైన పంపిణీ కేంద్రాలు ఇక్కడే ఉండేవి. తెలుగునాట మొదటి థియేటర్‌గా పోతిన సోదరుల మారుతి సినిమా హాలు 1921లో నిర్మాణమైంది. ఈ రోజున విజయవాడలో 50కు పైగా థియేటర్లున్నాయి. 150 పంపిణీ కార్యాలయాలున్నాయి. ఫిలిం పబ్లిసిటీ విషయంలో పూర్వపు రోజుల్లో ప్రజలకు వినోదం పంచటానికి సర్కస్‌లాగా 'జోస్ బయోస్కోప్'లు చూపేవారు. తర్వాత మూకీ చిత్రాలు వచ్చాయి. ఆ తర్వాత మాటలతో కూడిన సినిమాలు, ఈస్ట్‌మన్ కలర్ చిత్రాలు, ఇప్పుడు కంప్యూటరైజ్‌డ్ సినిమాలు, డిజిటల్ సౌండ్ సిస్టంగల సినిమాలు వస్తున్నాయి. విజయవాడలో మొట్టమొదటగా 'మారుతి' హాల్‌ని పోతిన శ్రీనివాసరావు నిర్మించారు. అయితే ఆ సినిమాహాల్ నేడు మూతపడి షాపింగ్ కాంప్లెక్స్‌గా రూపాంతరం చెందింది. 1921 మారుతీ, 1923లో దుర్గాకళామందిరం, 1929లో లక్ష్మీ టాకీస్, 1939లో రామాటాకీస్, 1940లో సరస్వతి పిక్చర్స్, 1944లో లీలామహల్, 1943లో జైహింద్ టాకీస్, 1949లో జవహర్‌టాకీస్ (ఇప్పటి విజయాటాకీస్), 1950 శేషమహల్, రాజస్థాన్ టాకీస్ 1951, ఇప్పటి ప్రియదర్శిని, ఈశ్వర్‌మహల్ (ఇప్పటి రాధా థియేటర్), షహెన్‌మహల్ (నవరంగ్ టాకీస్) ఇందులో కొన్ని హాల్స్ పూర్తిగా మూతపడివున్నాయి. కొన్ని హాల్స్ స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టారు. కొన్ని నిరుపయోగంగా పడివున్నాయి. మొట్టమొదటగా "ఆలంఆరా" ఇండియన్ టాకీ చిత్రం "మారుతీ టాకీస్"లో ప్రదర్శించబడింది.

దాళా రమేష్‌బాబు, విజయవాడ

విటమిన్ల కథ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

విటమిన్-ఎ

రెటినాల్, దానికి సంబంధించిన రెటినియిడ్స్ అనే పదార్థాలకు వాడుక నామం విటమిన్ - ఎ. ఈ విటమిన్ సాధారణ ఎపిథీలియంను పరిరక్షిస్తుంది. రెటీనా (కంటిపొర) ఫొటో కెమికల్స్‌ను తయారు చేస్తుంది. వ్యాధి నిరోధక ధర్మాలను వేగిర పరుస్తుంది. జబ్బుల నుంచి ముఖ్యంగా క్యాన్సర్ నుంచి రక్షణనిస్తుంది.

విటమిన్ - ఎ అనే పదం రెటినాల్, ప్రోవిటమిన్లు - బీటా కరోటిన్, బీటా క్రిప్టోగ్జాంతిన్ అనే వాటికీ వర్తిస్తుంది. విటమిన్ - ఎ యొక్క అంతర్జాతీయ యూనిట్లు 0.3 మి.గ్రా. రెటినాల్‌కు లేక 0.55 మి.గ్రా. రెటినాల్ పామిటేటుకు సమానం.

పెద్దలకు రోజూ 750 మి.గ్రా. రెటినాల్ ఈక్వివలెంట్లు అవసరం. గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు 1200 మి.గ్రా. రెటినాల్ ఈక్వివలెంట్లు అవసరం. పిల్లలకు 300 నుంచి 600 మి.గ్రా. అవసరం. విటమిన్ - ఎ చిన్నప్రేవుల్లో శోషింపబడుతుంది. అనేక మందిలో మొత్తం శరీరంలోని విటమిన్ - ఎ నిల్వలు 300 నుంచి 900 మి.గ్రా. వరకు ఉంటుంది. ఇందులో 90 శాతం కాలేయంలో నిల్వ ఉంటుంది. సాధారణంగా కాలేయంలో ఉండే విటమిన్ - ఎ నిల్వలు 9 నుంచి 12 నెలల వరకూ సరిపోతుంది. కాలేయంలోని నిల్వ అంతా అయిపోయాక విటమిన్ - ఎ లోపం వస్తుంది.

అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విటమిన్ - ఎ లోపం విస్తారంగా ఉంది. ఒకటి నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, గర్భం ధరించబోయే స్త్రీలు, పాలిచ్చే తల్లులు దానికి గురవుతున్నారు. భారతదేశంలో 10 శాతం స్కూలు పిల్లలు విటమిన్ - ఎ లోపంతో బాధపడుతున్నారు. అనేక కారణాల వల్ల దీని లోపం ఏర్పడుతుంది. సరిగా ఆహారం తీసుకోకపోవడం, తల్లులకు సరిగ్గా ఆహారం లేకపోవడం, శిశువుల్లో కాలేయంలో నిల్వలు తక్కువగా



ఉండటం, పెరిగే వయస్సులో అవసరం ఎక్కువగా ఉండటం, జబ్బులో ఎక్కువగా కావాల్సి రావడం ఉదాహరణకు పొంగు వ్యాధి.

విటమిన్ - ఎ లోపం వల్ల శరీరంలో రక్షణ వ్యవస్థ దెబ్బ తింటుంది. జబ్బులు విజృంభించే అవకాశం ఉంటుంది. ప్రేవుల్లో సరిగ్గా శోషించబడకపోవడం, ఖనిజ నూనెలను ఎక్కువగా వాడటం, కాలేయం జబ్బు ఉదాహరణకు సిర్‌హోసిస్, మూత్ర పిండాల ద్వారా పెరిగిన విసర్జన వంటివి కూడా విటమిన్ - ఎ లోపానికి గల ఇతర కారణాలు. సారాయి తాగే వారిలో రేచీకటి, ఇతర విటమిన్ - ఎ లోపం లక్షణాలుంటాయి.

విటమిన్ - ఎ లోపాలు ఎక్కువగా కంటికి సంబంధించినవి. చీకటిలో సర్దుకుపోయే శక్తి తగ్గడం, రేచీకటి, కంటిపొర ఎండిపోవడం, కంటిలో బైటాట్సు మచ్చలు రావడం, కార్నియా మసకబారి, మెరుపుతగ్గి, నెమ్మదించి చివరకు కెరటోమలేసియాకు దారితీసి అంతిమంగా అంధత్వానికి దారి తీస్తుంది. విటమిన్ - ఎ లోపం వల్ల ఊపిరితిత్తుల్లో, ప్రేవుల్లో జబ్బులు వస్తాయి. పొగతాగే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. తగినంతగా జంతువులకు సంబంధించిన కొవ్వును, ఆకుపచ్చ రంగు కల్గిన ఆకుకూరలు తినడం ద్వారా విటమిన్ - ఎ లోపం రాకుండా చేయవచ్చును.

విటమిన్ - ఎ లోపం ఉన్న ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలకు రోజూ 4500 అంతర్జాతీయ యూనిట్లు, పిల్లలకు రోజూ 3000 అంతర్జాతీయ యూనిట్ల విటమిన్ - ఎను ఇవ్వాలి. రోజువారీ మోతాదు ఇవ్వడం సాధ్యం కాని పక్షంలో ఆరు నెలలకొకసారి రెండు లక్షల అంతర్జాతీయ యూనిట్లు నోటి ద్వారా ఇవ్వాలి. క్యారెట్, ఆకుపచ్చని ఆకుకూరలు, పాలు, మజ్జిగ, వెన్న, గుడ్డు పచ్చసొన, కాలేయం, చేప కాలేయపు నూనెలు, పుచ్చకాయ, బొప్పాయి, మామిడి కాయ మొదలగు వాటిలో విటమిన్ - ఎ ఎక్కువగా లభిస్తుంది.



కథ

బలరాం ఒక్కడే కాదు. ఈ ఉత్సవాల పూజల సందర్భంగా చాలా మంది కుర్రాళ్లు తాగడం నేర్చుకుంటున్నారు. దేశవ్యాప్తంగా వీటి నిర్వహణ వెనుక ఆర్థికమో, రాజకీయమో లేదా రెండూనో... మొత్తానికేదో కుట్ర దాగుంది.

మొలకలపల్లి కోటేశ్వరరావు

పండుగ పందిరి

ఊరంతా విజయదశమి సంబరాలు చేసుకున్న రోజులవి. ఆడవాళ్లతో పాటు మగవాళ్లూ నుదుటన నిలువెత్తు కుంకుమ బొట్లు పెట్టుకున్నారు. అవ్యక్తానందంతో హడావుడి పడిపోతున్నారు. పూజలు, భజనలు చేస్తున్నారు. హారతులు పట్టడం, టెంకాయలు కొట్టడం, ఫలహారాలు పంచడంలో నిమగ్నమైన భక్తులు కొందరైతే... పీటల మీద కూర్చోవడం, మంత్రాలు వల్లించడం, అమ్మవారిని వినూత్నరీతిలో అలంకరించాలని యత్నించడం, పత్రి ఫలపుష్పాదులు సమర్పించడం, సాష్టాంగ ప్రణామాలు చేయడం, చందాలివ్వడంలో మరికొందరు లగ్నమయ్యారు. ఒక వైపు ఇలా ఉంటే మరోవైపు చెవులు తూట్లు పడేలా హోరెత్తిపోయే మైకుల గోల.

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అమ్మవారి పూజామందిరానికెదురుగా ఉన్న రోడ్డుమీద అడ్డంగా పడున్నాడు బలరాం. అతని బట్టలు దుమ్ముతోనూ, మట్టితోనూ నిండిపోయాయి.

"ఒక పక్కకు జరపండి. దరిద్రపోడు. శుతీపతీ లేకుండా తాగాడు" మందిరానికొచ్చే భక్తులంటున్నారు.

ఎవరికి వాళ్లు అతనిని చీదరించుకుంటూ, పక్కకు తప్పుకుంటున్నారు. అతన్ని పక్కకు లాగే ప్రయత్నమెవరూ చేయలేదు. ఎదురుగా ఉన్న అరుగు మీద కూర్చున్న నేనూ నారాయణ ఇదంతా గమనిస్తున్నాం. ఇక తప్పేట్లు లేదనుకున్నాం. ఇద్దరం కలిసి బలరాం చేతులూ కాళ్లూ పట్టుకుని రోడ్డుకు ఒక వారగా జరిపాం.

"అతనికి చదువులేదుగానీ ఇంజనీరే! ఇట్ట చూసి అట్ట పట్టేస్తాడు. ఏ పనైనా చక్కగా చేస్తడు. కరెంటు పని, మోటారు సైకిలు, మోపెడ్లు, కార్లూ జీపులు ఒక్కటేంది... అన్నింటినీ రిపేరు చేస్తడు. అతని తెలివే తెలివి. బుర్రే బుర్ర" బలరాం గురించి ఊళ్లో జనమనుకునే మాటలివి. బలరాం... సన్నగా, పొడవుగా ఉంటాడు. తెలివిగల వాడు. బుద్ధిమంతుడు. ఇప్పుడతని పరిస్థితి జాలి గొలిపేలా ఉంది. మనిషి బలహీనపడిపోయాడు. ఎముకల పోగయ్యాడు. తాగుడుకు బానిసయ్యాడు. ఫలితంగా లివరుకు సంబంధించిన జబ్బుతో బాధపడుతున్నాడు. 'తాడుగు మానకపోతే ఎక్కువ కాలం బతకవు' అని డాక్టర్లు స్పష్టంగా తేల్చిచెప్పారు.

అయినా అతను లెక్కచేయలేదు. ప్రాణం కన్నా అతనికి తాగుడే మిన్నయింది. ఎంతమంచి పనివాడు... ఏ స్థితికి చేరాడు. దీనికంతటికీ మూలం తాగుడే! మొదట అతనికి ఈ అలవాటుండేది కాదు.

తొమ్మిదేళ్ల కిందట...

వినాయక చవితి నవరాత్రులు లాంటి పండుగల సందర్భంగా కొంతమంది కుర్రవాళ్లు మొదటిసారిగా చందాలు వసూలు చేశారు. ఊరికి అమ్మవారి విగ్రహాన్ని తీసు కొచ్చారు. అంతకు ముందు ఎవరిళ్లలో వాళ్లు పండుగ చేసుకునేవారు. విగ్రహం రాకతో సామూహికంగానూ, సమిష్టి గానూ చేసుకోవడం మొదలుపెట్టారు. ఒక నమ్మకంగా వ్యక్తిగత స్థాయిలో ఉండాల్సిన భక్తి... ఈ పద్ధతితో క్రమంగా ఉన్మాదస్థితికి చేరింది. ఉత్సవాల పేరుతో భారీగా చందాలు వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులో కొంత భాగం తాగుడుకు తప్పనిసరి. విజయదశమి నవరాత్రుల్లాగా, వినాయక నవరాత్రులనూ పెట్టారు. తొమ్మిది రోజులు ఉత్సవాలు నిర్వహించడం వెనుక ఆనవాయితీగా రూపొందించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ రాత్రి కుర్రవాళ్లు ఏదోక చోటికి చేరడం... తాగడం... ఎగరడం! ఇదంతా పండుగ పందిరి పేరున సాగిపోతుంది. ఈ ఉత్సవాల పుణ్యమాని కుర్రవాళ్ల ప్రోద్భలంతో బలరాం మొదటిసారిగా తాగాడు. మొదట్లో అయిష్టంగా మొదలు పెట్టినవాడు... మిత్రుల ప్రోత్సాహంతో దాన్నిష్టంగా మార్చుకున్నాడు. క్రమంగా అలవాటైంది. ఆ అలవాటే వ్యసనంగా మారింది.

ఏ దురలవాటూ నేర్చుకోకూడదు. నేర్చుకుంటే అది వెన్నంటి ఉండడమే కాదు. వెంటాడుతుంది! బలరాం విషయంలో అదే సంభవించింది. అతను తాగుడికి పూర్తిగా బానిసయ్యాడు. తాగనిదే ఉండలేని స్థితి. వ్యసనం ముదిరేకొద్దీ పతనమూ దగ్గరవుతోంది. పనిమీద ధ్యాస తగ్గిపోయింది. ఎప్పుడెప్పుడు తాగుదామా... మత్తులో తూగుదామా... అనే ధ్యాస పెరిగింది. తెల్సినవాళ్లను చేబదుళ్లడిగేవాడు. కొద్దిరోజులకు అవీ పుట్టలేదు. దాంతో వడ్డీలకు అప్పు చేయడం మొదలెట్టాడు. చివరికి అప్పులిచ్చేవారూ కరువయ్యారు. దాంతో ఇంట్లో సామాన్లన్నీ నెమ్మదిగా తాకట్టుకూ, అమ్మకానికీ వెళ్లిపోయాయి. ప్రస్తుతం అడుక్కుతినే పరిస్థితి తెచ్చుకున్నాడు. బలరాంలో మార్పొస్తుందేమోనని అతని భార్య చాలాకాలం వరకూ ఎదురు చూసింది. చివరికామె ఓపిక నశించింది. అతన్నొదిలి వెళ్లిపోయింది. దాంతో అతని తాగుడుకు అడ్డు చెప్పే వారే కరువయ్యారు.

తాగడం మరింత ఎక్కువ చేశాడు. అందర్నీ 'ఏదో అవసరం' అని చెప్పి డబ్బడిగేవాడు. మొదట్లో ఇచ్చారు. బలరాంకు డబ్బివ్వడమంటే అతని ఆరోగ్యాన్నింకా పాడు చేయడమే.

బలరాం ఒక్కడే కాదు. ఈ ఉత్సవాల పూజల సందర్భంగా చాలా మంది కుర్రాళ్లు తాగడం నేర్చుకుంటున్నారు. దేశవ్యాప్తంగా వీటి నిర్వహణ వెనుక ఆర్థికమో, రాజకీయమో లేదా రెండూనో... మొత్తానికేదో కుట్ర దాగుంది. ఆ కుట్రను ఛేదించేదెప్పుడో! ఈ లోపు బలరాం లాంటి వారెంతమంది ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగానూ నాశనం కావాలో? ఇంకా ఎంతమంది బలి కావాలో...?

ఓరి నాయనో...

మన్నెం

విక్రమార్కుడూ, భేతాళుడు చేస్తున్న ఇంటర్వ్యూలను చూసి బివి టీవి ప్రత్యర్థులు తమ మాయా టీవికి మారితే మరింత జీతం చెల్లిస్తామని వారికి ఆశపెట్టారు. ఇంకేం మాయా టీవికి ఎగిరి గంతేశారు. ప్రాజెక్టులతో ఊళ్లకు ఊళ్లు మునిగి పోయి చెరువు నుండి బయట పడే చేపపిల్లల్లా చెట్టూ పుట్టల నుంచి మైదానాలకు విసరి వేయబోయే అడవి బిడ్డల గురించి మంచి స్టోరీస్ చేయవచ్చని వారనుకున్నారు.

భలే వారయ్యా మీరు! మాయా టీవిని మట్టికరిపించేట్లున్నారే, వారి గురించి ఎవరికి కావాలయ్యా? మంచి అందమైన స్టోరీలను చేయాలి. లేకుంటే ఛానల్ మూసుకోవాల్సి వస్తుంది. పోనీ ఒకపని చేయండి, ఎకరం ఏడు లక్షల రూపాయల పరిహారం అడుగుతున్న వారి గురించి చేయండి అన్నారు న్యూస్ ఎడిటర్.

సరే సార్ అంటూ గోదావరి వైపు బయలు దేరారు. సరిగ్గా అదే సమయానికి మాజీ ముఖ్యమంత్రి ఇంద్రబాబు గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు బయలు దేరారు. స్టేషన్‌లో విక్రమార్క్, బేతాళ్ కనిపించగానే ఆయనే

రండి బ్రదర్ ఏమిటిలా వచ్చారు అంటూ పలకరించారు. మాయా టీవి మార్కు చూసి ఏమిటీ మీరు కూడా ఛానల్ మార్చేశారా అంటూ అటూ ఇటూ తిరిగి చూశారు. వెనకే సెక్యూరిటీ ఉన్నా సార్ అన్నట్లు చూశాడు.

మేము కూడా తిక్కలపూడి వెళుతున్నాం.

అక్కడ మా నాయకుడి ఆమరణ నిరాహారదీక్ష ప్రభుత్వాన్ని కదిలించకలేకపోయినా మిమ్మల్ని కదిలించింది, ఎంతఅన్యాయం బ్రదర్, ప్రాణాలు పోతున్నా ఈ సర్కార్ పట్టించుకోదని మీరు మైండ్‌సెట్ మార్చుకుంటే మంచిది.

కదిలించటమా పాడా అక్కడ జరుగుతున్న 'ప్రైవేటు' ఆమరణ దీక్ష నెంబర్-5 గురించి మంచి స్టోరీ చేద్దామనుకుంటున్నాం.

అదే బ్రదర్ మీతో చిక్కు, నేను కొంత 'ప్రైవేట్' చెబితే మీరు మరికొంత ఎక్కువ రాసి నా కొంప ముంచారు. దానికి తోడు వామపక్షాలు మీకు బాగా తలకెక్కించాయి.

మాకు మా సొంత బుర్ర కాస్తన్నా ఉండబట్టే బతికి పోయాం లేకుంటేనా? ఏమాటకామాటే చెప్పుకోవాలి సార్ మీ తొమ్మిదేండ్ల పాలనలో ప్రతిదీ ప్రైవేటు పరంకావాలన్న మిమ్మల్ని చూసి మాక్కూడా అలవాటైంది. అయినా సార్ సొంత ఇంట్లో కూర్చుని పరుపుల మీద, సోఫాల మీద పడుకొని, కిటికీలు మూస్తూ తెరుస్తూ ఆమరణ దీక్ష చేయటం ఏమిటి సార్? ఎక్కడన్నా ఇలా జరిగిందా? మీ ఆఫీసు బీట్‌లో ఒక్కపూట తిండితినకపోతేనే తట్టుకోలేమే ఆయన ఇన్ని రోజులు ఎలా ఉన్నారబ్బా?

అంటే ఇంట్లో తింటూ డ్రామా ఆడుతున్నాడంటారా? ఏమిటి బ్రదర్ మీరు మాట్లేది.

ఆ మాట మేమెక్కడన్నాం సార్? గుంటూరుజిల్లాలో మాజీ ఎంఎల్‌ఏ నమృతరావు తన



లెటర్‌పాడ్ మీద ఎన్నిసార్లు ఆమరణదీక్ష చేసిందీ అచ్చేసుకొనే వారట. ఆ రికార్డును తిరగరాస్తారా ఏమిటి ? జనం నవ్వరా సార్?

బ్రదర్.... కెమెరా ఆన్ చేసి లేదు కదా!.... మనలో మాట..... చెప్పుకుంటే సిగ్గుపోతుంది. ఏం చెయ్యాలో మాక్కూడా దిక్కుతోచనందునే ఇన్నాళ్లూ ఆగాం. మమ్మల్ని చూసి నవ్వే జనం ఉన్నట్లే మేం ఏంచేసినా ఆహో ఓహో అనే అమాయక జనం ఎప్పుడూ ఉంటారు బ్రదర్.

అయినా అదేంటి సార్ ఆయన ఇంతకు ముందు తన కరెంటు బిల్లు గురించి ఒకసారి సిల్లీగా దీక్ష చేశాడట. ఏకంగా ఇప్పుడేమో తుపాకులు పక్కన పెట్టుకొని తనతో పాటు భార్యాబిడ్డలనూ చావమంటున్నారట ఇదెక్కడి తిక్కండీ బాబూ ! మీరైతే ఏం చేసేవారు?

ఏదో ఒకటి చేసే వాడిని కానీ ముందు సిగ్నల్ ఇచ్చారు పదండి బ్రదర్ తిక్కలపూడిలో మళ్లీ కలుద్దాం.

విక్రమార్క్, బేతాళ్ కెమెరా పట్టుకొని తిక్కలపూడి సెంటర్‌కు చేరుకున్నారు. అప్పటికే అన్ని టీవిల వాళ్లూ వచ్చారు. ఒకరినొకరు తోసుకుంటూ తెలుగుదేశం నేత ఇంటికి చేరుకున్నారు. అయితే జనం బాగా ఉండటంతో పోలీసులు ఇంద్రబాబును ఇంటివెనుక నుండి తీసుకు వచ్చి దీక్ష జరిగే కిటికీ వద్దకు తీసుకువచ్చారు. కిటికీ మూస్తాను తప్ప గది తెరవనంటే తెరవనని చెప్పటంతో ఇంద్రబాబుకు దిక్కుతోచలేదు. వెంటనే ఎస్‌కోటకు వెళ్లిపోయాడు. చివరకు ఎవరైనా భూములిస్తే భూములు పోయిన వారికి అప్పగిస్తామని కలెక్టర్ ఒక లేఖ పంపటంతో దీక్ష నాయకుడు రసం తాగాడు, జనం ఊపిరి పీల్చుకున్నారు. మాయా టీవి జనాన్ని పలకరించింది. అక్కడికి వచ్చిన వారిలో పరకాయ ప్రవేశం చేసింది. అంతరంగం ఒక్కొక్కటే తెలుస్తోంది.

అప్పటివరకు ఎకరానికి ఏడులక్షల రూపాయలు వచ్చినట్లే ఊహించుకొని తన పొలం ఎటుందో కూడా తెలియని రంగబాబు కత్తిపూడిలో కలలు కంటున్నాడు. ఒక్కసారిగా జేబులు కొట్టేసినట్లు గుండెలు బాదుకుంటున్నారు.

మనం దీక్ష చేయమన్నామా, ఏదో లక్షా రెండులక్షల భూమికి ఏకంగా ఏడులక్షలు ఇప్పిస్తామంటే మనకు పోయేదేముందని ఇన్నాళ్లూ ఇక్కడికి తిరిగాం ఇప్పుడు ఈ పెద్దమనిషి ఇలా చేస్తాడా అనుకుంటున్నాడు సత్తిరాజు.

ఈ లెక్కన ప్రభుత్వం ఇస్తానన్న రెండులక్షల రూపాయలైనా వస్తాయా? వచ్చిన మేరకు తీసుకొని వ్యవసాయం వదిలి పెడదామనుకొంటుంటే ఈ తిక్క మనిషి ఇప్పుడు భూములకు భూములకు అంగీకరించాడు. రేపు మా భూములను పరిహారం ఇవ్వకుండా తీసుకొని వేరే భూమిలిచ్చే వరకు ఆగమని ప్రభుత్వం అంటే ఓరి నాయనో అంటూ గుండెలు బాదుకుంటున్నవారు ఎందరో....... ఇంతలో ట్రైన్ టైం కావటంతో విలేకర్లు పరుగో పరుగు.



సెన్సూ కామన్ సెన్సు

మంగళసూత్రాలు పెద్దవిగా... మనసులు చిన్నవిగా...

నాగసూరి వేణుగోపాల్

సుకృతి వడివడిగా వచ్చి తలుపులు తీసుకుని లోపలికి చొరబడింది.

"అమ్మా ప్రకృతీ.... ఇక్కడే ఉన్నావా ? నీవు ప్రకృతిలో పులకించిపోతూంటే... నేను అడ్డుపుల్ల కాదుగదా... అనుకుంటూ వచ్చా" అంది సుకృతి.

"అదేంటి సుకృతీ... అలా అంటావు. మనం ఇలా కలుసుకోవాలి, మాట్లాడుకోవాలి... ఇరుగుపొరుగు అన్నా తరువాత ఒకళ్లకొకళ్లు కలుసుకోవాలీ...కష్టం సుఖం కలబోసుకోవాలి. లేకపోతే పొద్దస్తమానం టీవీ ముందే కూలబడతారు. అలా టీవీ పెట్టెలకే అతుక్కుపోతే ఎంతో ప్రమాదమే తల్లీ" అని జవాబు ఇచ్చింది ప్రకృతి.

"కలుసుకోవాలి, మాటాడుకోవాలి.... టీవీతో వచ్చే బీపీలు రాకుండా చూసుకోవాలి అంటున్నావ్ బాగానే ఉంది. అన్నట్లు ఇటీవల 'గాసిప్' అని అంటున్నారే.. అదేనే ఉబుసుపోక మాటలున్నాయి గదా! అదొకోసారి వినేవాళ్లకు భరించరాని వీరమహాసుత్తిలా ఉంటుంది కూడానూ. కానీ ఈ మధ్య దీని మీద కూడా పరిశోధకులు శోధించేసి ఏదో కొత్త అంశం కనిపెట్టాశారుట విన్నావా...ఈ తరహా గాసిప్‌కు బలయ్యే వారి కథ తెలియదు గానీ, గాసిప్ చేసే వారికి మంచిదని మనస్తత్వ శాస్త్రవేత్తలు ఇటీవల పరిశోధన చేసి ప్రకటించారు. ఏమైతేనేం హాయిగా మాట్లాడుకోవడం వల్ల టెన్షన్ తగ్గుతోందట. అట్లని మన మహిళలు అర్థం లేని గాసిప్ అనగా సుత్తి కొట్టగూడదు సుమా!" అంటూ సంభాషణ పొడిగించింది సుకృతి.

"...గాసిప్.. టెన్షన్ విషయం ఏమోగానీ, టీవీలలో వచ్చే గాసిప్‌ను దాని అల్లుడును చూస్తుంటే ఏమనాలి చెప్పుమరి. రాత్రిపూట ప్రసారమయ్యే సీరియల్ గురించి ప్రకటన చూడు. యమునను వితంతువుగా చూపాలి. అంతే తెల్లచీర, తెల్ల జాకెట్ రెడీ. నిజానికి ఎవరైనా భర్త పోయినవారు ఇప్పుడు ఇలా తెల్ల చీరతో, దువ్వని జుట్టుతో, ఎవరికీ ఎదురుపడకుండా జాగ్రత్తగా ఇంటిలోపలెక్కడో గుంభనంగా ఉంటున్నారా? ఏమిటి?" అని అడిగింది ప్రకృతి.



మధ్యలోనే అందుకుని సుకృతి..."అవును ప్రకృతీ... మన సమాజమే క్రమంగా సర్దుకొంటోంది. స్త్రీకి తనభర్త చనిపోయారని తెలిసేలా దుస్తులు, అలంకరణ ఉండాల్సిన పనిలేదు. సమాజంలో దాదాపుగా అమలులో లేని వాటిని ఇప్పుడు టీవీ సీరియల్స్‌లో ఇదెందుకు చేయడం? లేని మౌఢ్యం, అంతరించిపోతున్న ఆచారాలను పవిత్రమైనవిగా మనకు పరిచయం చేయడం అంటే ఇదే! ఇంతే కాదే సినిమాలలో, టీవీ సీరియల్స్‌లో మంగళ సూత్రాలు అంత పెద్దవిగా, బాగా కనబడేలా చూపుతుంటారు. అసలు అది అవసరమా? మనమంతా అలా వేసుకొని తిరుగుతున్నామా?" అని ప్రశ్నించింది. "మంగళ సూత్రాలు పెద్దవిగానే చూపిస్తున్నారు. కానీ ఆ పాత్రల మనసులు మాత్రం ఇరుకుగా, సంకుచితమైనవిగా ఉంటాయి. పెద్దబొట్టు, జూమ్‌చేసి చూపెడుతున్న మంగళసూత్రాలు...కానీ ఆమె ఒక గయ్యాళి, లేడీ విలన్. ఒక పెద్దబొట్లు కోడల్ని వేపుకుతింటే, మరో పెద్ద మంగళసూత్రం అత్తను సవాల్ చేసి ఆమె ఎత్తును చిత్తు చేసే పైఎత్తు నారీమణి. వెరసి ఇద్దరి భర్తలు తమ కాలుదగ్గిరి పిల్లులు. వీళ్ల ప్రవర్తనలు, చేష్టలు, కథావిధానం అంతా కుటుంబం అల్లకల్లోలమే. ఎక్కడా పాజిటివ్‌గా అలోచించరు. ఘర్షణాయుతంగానే కుట్రకుయుక్తులమయంగానే ప్రవర్తిస్తారు."

"ఈ మంగళసూత్రాలుంటేనే చాలు ఆమె సాధ్వి అని లేకుంటే పతిత అని అన్నంత ఎక్కువగా గ్లోరిఫై చేస్తున్నారు. అసలు ఇవన్నీ ఇలా ఎందుకు చూపెడుతున్నారు?"

"ఇలా ప్రశ్నించకపోవడమే ప్రకృతీ, మన ఆడవాళ్లు ఇలా ప్రశ్నించక పోవడంవల్లే మనకు అదే చూపిస్తారు. మనం అలాంటివి చూడ్డానికే ఉన్నట్లుగా కూడా ప్రచారం చేయిస్తున్నారు. దీని నుంచి మొదలై మేం చూపించిందే చూడాలి...అదే అనుసరించాలి అన్నట్లుగా కూడా కొందరి సీరియల్స్ వెనుకున్న ఆలోచన. ఇలా ప్రశ్నించేవారు ఉంటే ఇలా వాళ్ళకు తోచినట్టు చేయరుగదా ? ఇంకో విషయం తెలుసు గదా చానళ్లలో వితంతువులే గాదు, అత్తలూ, అమ్మలు కూడా చిన్న వయసులోనే ఉండాలని చాలా జాగ్రత్త తీసుకుంటారు. ఎందుకు ? వారు ఏ పాత్ర పోషించినా, ఏ దుస్తులేసినా- ఆకర్షణీయంగా ఉండాలి. తప్పదు" అని సుకృతి అనబోతుండగా ప్రకృతి " అవునవును నీవు చెప్పేది చాలా కరెక్టు... ఇంతకు ముందు పండుగ ఏదో ఇంట్లో జరుపుకోవడం వుండేది. ఇపుడు టీవీ పుణ్యమా అని ఆ తంతు అంతా, అందరికీ చూపడం అవుతోంది" అని వివరించబోయింది. అంతలో సుకృతి ".. అదే సమస్య... మనం మంచి విషయాలు, ఉపయోగపడే సంగతులు నేర్చుకోలేం గానీ ఇలాంటి విషయాలు మాత్రం సులువుగా వంట బట్టించుకుంటాం. పోషకాహారం, చౌకగా లభించే తృణధాన్యం వల్ల ఉపయోగాలు గురించి టీవీలో అంతా చెప్పరు. దాని నెవరు స్పాన్సర్ చేయరు కనుక, దాంతో వారిక లాభం ఉండదు. కనుక!.." మధ్యలో ప్రకృతి అందుకొని "అందుకే మనం చైతన్యవంతం కావాలి, చెత్త టీవీ కార్యక్రమాలను ఖండించాలి" అంది బిగ్గరగా !

"అప్పుడే మన సెన్సుకి కామన్ సెన్సున్నట్లు కదా" అంది సుకృతి.

ఓ ఊరి కథ

త్రినేత్ర

పురాతన, ఆధునిక చరిత్రల గోవాడ

గోవాడ అనే పదం అనేకమంది ఇంటిపేరుగా వినేఉంటాం. ఈ గోవాడకు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర ఎంత ఉందో అంతకుమించి జైన, బౌద్ధ మతాలకీ వీరశైవమతానికీ మధ్య జరిగిన మత యుద్ధాల చరిత్ర కూడా ఉంది. గుంటూరు జిల్లా స్వాతంత్ర్యోద్యమ చారిత్రక పుటల్లో కూడా ఈ గోవాడ చాలా ప్రముఖ్యత పొందిన గ్రామం. పావులూరి శివరామకృష్ణయ్య, కాట్రగడ్డ మల్లికార్జునరావు, తుమ్మల చిన్నమ్మాయి, తలశిల కోటమయ్య, ఉప్పల సుబ్బయ్య, తోలు వెంకట రామయ్య లాంటి స్వాతంత్ర సమరయోధులనందించిన గ్రామం ఈ గోవాడ. గాంధీ, పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, ఆచార్య రంగా, కల్లూరి చంద్రమౌళి, గొల్లపూడి సీతారామశాస్త్రి, జె సి కుమరప్ప, వినోభా భారతీరంగా లాంటి యోధానుయోధులు ఆ గ్రామాన్ని సందర్శించి ఎంతో ప్రభావాన్ని కలగజేశారు. ఆ గ్రామ యువతరం నాటి స్వాతంత్రసమరంలో చాలా క్రియాశీలమైన, ఉత్తేజకరమైన పాత్ర నిర్వహించారు.

బ్రిటీష్ వారు ఎందుకైనా చేయించనివ్వండి కానీ...కల్నల్ మెకంజీ చేత రాయించిన గ్రామాల సర్వేలు, రెవెన్యూ రికార్డులు, గ్రామ చరిత్రలతో కూడిన కైఫియ్యతులు నేడు అనేక గ్రామాలకు చెందిన లిఖితచరిత్ర మనకు లభిస్తోంది. గోవాడ గురించి మెకంజీ రాయించిన కైఫియ్యతు, సదాశివ దేవరాయుల శాపము, పొన్నుపల్లి తామ్రశాసనం ద్వారా ఎంతో విలువైన సమాచారం నేటి తరానికి అందుతోంది. ఆ ఊరి మేధావులు రాసిన "స్వాతంత్ర్యోద్యమంలో గోవాడ"పుస్తకం ఎంతో సమాచారం తెలుస్తుంది

గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా సంతు పులివర్రు దగ్గర గ్రామంగా ఈ గోవాడ ఉండేది. ఆనాడు బస్తీగా ఉన్న మజుకూరికి దక్షిణాన దగ్గుమిల్లిపాడు అనే దిబ్బ ఉండేది. దాన్ని అంతకుపూర్వం దగ్గుమిల్లి అనే వారు. క్రీ.శ. 11 శతాబ్దంలో చోళరాజులు రాకముందు ఇప్పుడు మనం చందోలు అని చెప్పుకుంటున్న సనదవోలు రాజధానిగా మొదటి గొంకరాజు పరిపాలించేవారు. ఆయన జైనమతాభిమాని అవ్వటంతో జైనులు సర్వసౌకర్యాలతో వసతులేర్పరుచుకున్నారు. ఆవిధంగా ఈ దగ్గుమిల్లిలో జైనులు నివశించేవారు. వీరశైవులు విజృంభించకముందు వరకు ఈ జైనులు, ఇతర ప్రజలు కలిసిమెలిసి ఈ గ్రామంలో పాడిపంటలతో బతికారు. 12వ శతాబ్దంలో వెలనాటి ప్రభువు రెండవ చోడభూపతి (కులోత్తుంగ రాజేంద్ర చోడుడు) బౌద్ధ మతాభిమాని. ఆయన కాలంలో కూడా బౌద్ధులతో పాటు ఈ జైనులకు కూడా సమాన ఆదరణ ఉండేది. ఆ కాలంలో వీరశైవ మతాచార్యుడైన మల్లిఖార్జున పండితారాధ్యులు తన శిష్యులతో సహా వచ్చి సనదవోలు(చందోలు) సంస్థానంలో ఉన్న బౌద్ధపండితులను ఓడించాడు. అతని శిష్యులైన వీరశైవులు అక్కడ దగ్గర్లోని బౌద్ధారామంలోని బౌద్ధాచార్యుని పొట్టచీల్చి చంపేశారు. అక్కడ చెలరేగిన అలర్లలో వీరశైవులు మూకగా దగ్గుమిల్లి మీద పడ్డారు. దాడిచేసి జైనులనూ, వారి పశువులను చంపేశారు. బతికినవారు పారిపోయారు. మిగిలిన పౌరులు తమ పశువులకు చావిళ్లు వేసుకుని ఆ పక్కనున్న బీళ్లలోనే కాపురం ఉన్నారు. క్రమేణా అదే ఒక ఊరుగా పెరిగింది. దగ్గుమిల్లిలో జైనులు తగ్గిపోయాక ఆ ఊరు తమకు కలసిరాలేదని అనుకున్న ప్రజలు పశువుల చావిళ్లతో ఉన్న ప్రాంతానికి వచ్చేశారు. గోవుల పోషణమీద ఆధారపడి జీవించేవారు కనుక ఆ ప్రాంతాన్ని గోవులవాడ అని పిలుచుకునేవారు. గోవులవాడ కాలక్రమంగా జనం పలుకుబడిలో "గోవాడ"గా ఏర్పడింది.

గోవులవాడగా ప్రసిద్ధి కనుక సహజంగా ఆ ఊర్లో ప్రతీ ఇంట పశుసంపద కళకళలాడుతూ ఉండేది. 1935వ సంవత్సరంలో ఆలపాటి సూర్య నారాయణ గారు రకరకాల వ్యవసాయ వస్తువుల, మంచి పాడిగల పశువుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎద్దుల అరకదున్ని పోటీలు, బరువులు లాగే ఎద్దుల పోటీలను కూడా నిర్వహించారు. దీన్ని చూసే ఆనాటి వైశ్రాయి లార్డ్ విల్లిత్‌గో ఢిల్లీలో అఖిలభారత పశు ప్రదర్శనను ఏర్పాటు చేశారుట.

ఇదంతా ఒకెత్తయితే స్వాతంత్ర్యోద్యమంలో ఆ ఊరి పాత్ర మరొకెత్తు. 1920 నాటికే గోవాడ గ్రామ యువకులు గాంధీ మార్గాన నడుస్తున్నారు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రేసు సభలో గాంధీ ఉపన్యాసం వినడానికి వెళ్లిన గోవాడ యువకులు ఎంతో ప్రభావితులయ్యారు. జాతీయభావాలతో పాటు జాతీయభాష అయిన హిందీని కూడా నేర్చుకోవడానికి నడుం కట్టారు. కృష్ణాజిల్లాకు చెందిన దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారిని పిలిపించుకుని మరీ హిందీ నేర్చుకున్నారు. హిందీ భాషా ప్రచారానికి ఈ గ్రామం ఒక పట్టుగొమ్మ. దేవాలయాల్లోకి దళితుల ప్రవేశం దగ్గర్నుంచి గ్రంథాలయోద్యమం వరకూ అన్ని రకాల అభ్యుదయ భావాలకు నిలయం ఈ గోవాడ. 1929 ఏప్రిల్ 19వ తేదీన మహాత్మాగాంధీ ఖద్దరు నిధి వసూలు చేస్తూ ఈ గ్రామం వచ్చారు. గాంధీ పిలుపునందుకుని ఖద్దరు ఉద్యమం, చరఖా ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయనిరాకరణ, మద్యపాన వ్యతిరేకోద్యమం, ఉప్పు సత్యాగ్రహం తదితర స్వాతంత్ర్యోద్యమ అన్ని ఘట్టాలలోనూ పాల్గొన్నారు. అనేకమంది స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలుగా పాల్గొని జైళ్లకు వెళ్లారు. అనేక త్యాగాలు చేశారు.

1944లోనే "తాతానంద సమిష్టి వ్యవసాయ క్షేత్రం" ఏర్పాటు చేసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా అదే స్ఫూర్తి, చైతన్యంతో గ్రామ అభివృద్ధి చేసుకున్నారు. ఉన్నత విద్య కోసం మూడుమైళ్ల దూరాన ఉన్న తురుమెళ్ల వెళ్లేవారు. ఆ స్థితినుంచి మంచి విద్యాలయాలను తమ గ్రామంలోనే ఏర్పాటు చేసుకోగలిగారు.

✣



మన నేతలెంత నిజాయితీ పరులు?

అని గాలప్ ఇంటర్నేషనల్ వాయిస్ ఆఫ్‌ది పీపుల్ అనే సంస్థ ఇటీవల ఒక సర్వే నిర్వహించిందట. అరవై ఎనిమిది దేశాలలో 50వేల మందిని ప్రశ్నించారు. కేవలం 13శాతం మాత్రమే రాజకీయ నాయకులను విశ్వసిస్తున్నట్లు తేలింది. మరిన్ని అధికారాలు ఇవ్వాలని 16 శాతం మంది చెప్పారు. ఐరోపా వారు తమ రాజకీయ నాయకుల పట్ల అత్యంత నిర్లిప్తత ప్రదర్శించారట. రాజకీయ నాయకులు, వ్యాపారులు, మత, మిలిటరీ నాయకులంటే తమకు విశ్వాసం లేదని సగటున మూడోవంతు మంది చెబితే మధ్య, తూర్పు ఐరోపాదేశాలలో సగం మంది అలాంటి వారున్నారు.

- ఎంకెఆర్



నవ్వూ ఏడుపు

దేవుడూ, దయ్యమూ- ధైర్య, అధైర్యాల సంకేతాలు

తల్లీ, తండ్రీ- పుట్టుకకు, పెరుగుదలకు కారకాలు

భార్యా, పిల్లలు- జీవించటానికి, ప్రేరకాలు, ప్రోత్సాహకాలు

హితుడు, శత్రువు-మనః చింతనలో ఎగుడు, దిగుడు

పుట్టుట, గిట్టుట-ప్రకృతి నవ్వూ ఏడుపు.

డా॥ నాగినేని భాస్కరరావు



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

మేధస్సుతోపాటు మనిషి మెదడూ పెరుగుతుందా?

మనిషితోజీవపరిణామం ఆగి పోయిందా, కొనసాగుతోందా అన్న సమస్యపై రెండు వారాల క్రితం రాసిన వ్యాసానికి అనేక రకాల స్పందనలు వచ్చాయి. ఆధునికమానవుడు ఆవిర్భవించడం తోనే అతని భౌతిక పరిణామం ఆగిపోయిందని, ఆపై జరిగేదంతా సాంస్కృతిక పరిణామమేనన్న విషయాన్ని అంగీకరించిన వారిలో కూడా కొందరు మనిషి విజ్ఞానం పెరుగుతున్న కొద్దీ అతని మెదడు పెరుగుతుంది కదా అన్న ప్రశ్న లేవనెత్తారు. ఈ విషయం ఆలోచించదగ్గదే. మనిషి జ్ఞానాన్ని నిల్వచేసే స్థానం అతని మెదడు. కనుక మనిషి విజ్ఞానాన్ని పోగుచేసుకుంటున్న కొద్దీ అతని మెదడు మరింత సంక్లిష్టంగా మారాలి, ఇంకా ఇంకా పెరుగుతూ పోవాలి. నిజానికి ఈ విషయం శాస్త్రవేత్తలు ఏనాటినుండో ఆలోచిస్తున్నదే.

బాగా విజ్ఞానం సముపార్జించిన భవిష్యత్ మానవుడు ఎలావుంటాడు? కాళ్లకూ, చేతులకూ పని ఉండదు గనుక అతని కాళ్లూ, చేతులూ తోటకాడలాగా సన్నగా, బలహీనంగా ఉంటాయి. మెదడుతో బాగా అలోచిస్తాడు, మెదడులో అనేక విషయాలు దాచుకుంటాడు గనుక మెదడు పెద్దగా ఉంటుంది. అందువల్ల భవిష్యత్తు మానవుడు పెద్ద తలకాయ, సన్నని కాళ్లూ, చేతులూ, బలహీనమైన శరీరం కలిగి ఉంటాడు..... ఇదీ చాలా మంది ఊహించిన చిత్రం. ఈ ఊహా చిత్రాన్నే ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బెర్గ్ తన సినిమాల్లో ప్రదర్శించాడు. అయితే ఈ లక్షణాలను ఆయన భూమిమీద ఉన్న మనుషులకు కాకుండా అంతరిక్షంలో మనకన్నా మేధస్సులో బాగా అభివృద్ధి చెందిన గ్రహాంతర వాసులకు ఆపాదించాడు. ఆయన తీసిన 'క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్'లో గాని, 'ఇటి'లో గాని గ్రహాంతర వాసులు పెద్దపెద్ద తలకాయలతోనూ, చిన్నచిన్న శరీరాలతోనూ కనిపిస్తారు. ఈ మహావిశ్వంలో మన 'పాలపుంత' గెలాక్సీలాంటి అనేక కోట్ల గెలాక్సీల్లో అనేక చోట్ల మన 'సూర్యకుటుంబం' లాంటి అనేక గ్రహవ్యవస్థలు ఉండి ఉండవచ్చు. వాటిలో మనలాంటి విజ్ఞాన జీవులు అభివృద్ధి చెంది ఉండవచ్చు. అటువంటి గ్రహాల్లో కొన్ని చోట్ల మానవులకన్నా విజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన వారూ ఉండొచ్చు. వారు భూమి మీదకొస్తే ఏమవుతుంది అన్న విషయమై అనేక కథలు వచ్చాయి. వాటి ఆధారంగా అనేకానేక సినిమాలు తీశారు. వీటన్నిటిలోనూ, మనకన్నా బాగా అభివృద్ధి చెందిన గ్రహాంతరవాసులు పెద్ద పెద్ద తలకాయలతో ఉంటారన్న విషయం మాత్రం పూసల్లో దారంలా కనిపిస్తుంది.

అయితే మానవుని విజ్ఞానాభివృద్ధి క్రమాన్ని గనుక పరిశీలిస్తే ఇటువంటి ఊహలన్నీ తప్పని తేలుతుంది. ఆది మానవుడు ప్రతి పనికీ తన శరీరాన్ని ఉపయోగించేవాడు. అతను ఎల్లకాలం తన శరీరంతోనే పనులు చేయాల్సి వచ్చి ఉంటే పెద్ద పెద్ద పనులకు-అంటే పెద్ద రాళ్లను, దుంగలను ఒకచోటినుండి మరోచోటికి తీసుకుపోవడం వంటి పనులకు మరింత శ్రమ వెచ్చించాల్సి వచ్చేది. మరింత వేగంగా ప్రయాణించాలంటే తన కాళ్లను మరింత ఎక్కువగా ఉపయోగించాల్సి వచ్చేది. ఆ విధంగా అతను మరింత పెద్ద పనులు, మరింత వేగంగా చేస్తూ పోవాలంటే అతని శరీర భౌతిక సామర్థ్యం మరింతగా పెరుగుతూ పోవాలి.

కాని మానవుని పరిణామం అలా జరగలేదు. అతని విజ్ఞానం పెరగడం వల్ల పనిముట్లను చేయడం నేర్చుకున్నాడు. పనిముట్లంటే యంత్రాలే.

తన కండరాలు చేయాల్సిన పనిని ఈ



పనిముట్లకు అప్పగించాడు. యంత్రాలను పనిచేయించడానికి తొలుత తన శరీరంలోని శక్తిని ఉపయోగించాడు, పశువుల శక్తిని దానికి జతచేశాడు. ఉదాహరణకు, తొలిదశలో గాలిమరలను మనుషులే తిప్పేవారు, లేకుంటే పశువులు తిప్పేవి. నాగలితో దున్నడం మనుషులు చేసేవారు, లేకుంటే పశువుల చేసేవి. ఇప్పటికీ మనుషులు లాగుతున్న బండ్లున్నాయి. పశువులు లాగే బండ్లూ ఉన్నాయి. తరువాతి కాలంలో మనిషి కండర శక్తి స్థానంలో ఇతర ఇంధనాల శక్తిని ఉపయోగించడం ప్రారంభించాడు. దాంతో మనిషి తన శరీరంతో చేయలేని పెద్ద పెద్ద పనులను కూడా ఇంధనంతో నడిచే యంత్రాలతో చేయించగలుతున్నాడు. ఆ విధంగా మనిషి ఒక పరిమితి వరకు తన శక్తిని ఉపయోగించాక ఇంక ఆ పనిని యంత్రాలకు అప్పగించాడు.

ఇదే పరిస్థితి మెదడు విషయంలో కూడా జరుగుతుంది, ఇప్పటికే జరుగుతోంది కూడా. మనిషి మెదడుతో ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు తన తరఫున ఆలోచించే పనిని మనిషి కంప్యూటర్‌కు అప్పగించాడు. నిజానికి మనిషి మెదడు యొక్క వివేచనా సామర్థ్యంతో పోలిస్తే ఎంత శక్తివంతమైన కంప్యూటర్ సామర్థ్యమైనా దిగదుడుపే. కాని మనిషి మెదడు చేయలేనంత స్పీడుగా కంప్యూటర్లు అనేక పనులను చేయగలవు.

రానురాను మరింత శక్తి వంతమైన సూపర్ కంప్యూటర్లు అందుబాటులోకి వస్తున్నాయి. కంటికి కనిపించని కంప్యూటర్ల తయారీకి 'నానో టెక్నాలజీ' తెరతీస్తోంది. ఈ టెక్నాలజీ అభివృద్ధి చూస్తుంటే కొద్ది కాలంలోనే జేబులో పెట్టుకు పోయే సూపర్ కంప్యూటర్లు తయారవు తాయనిపిస్తోంది. అందువల్ల మనిషి మెదడు చేసే చాలా పనులను ఈ కంప్యూటర్లే చేస్తాయి. ఇప్పటికే వాతావరణ విశ్లేషణలు, జీనోమ్ మ్యాప్ తయారీలు వంటి అతి క్లిష్టమైన, మనిషి మెదడు చేయడం అసాధ్యం అనిపించే పనులను సూపర్ కంప్యూటర్లు చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ క్రమం మరింత పెరుగుతుందే కాని తగ్గదు. అంటే భవిష్యత్తులో మనిషి ఇప్పటికన్నా ఆలోచించడం పెద్దగా పెరిగేదేమీ ఉండదన్న మాట. తన శరీరం చేసే పనిని యంత్రాలకు అప్పగించినట్లే, మెదడు చేసే పనిని కంప్యూటర్లకు, అప్పగిస్తాడు. మనిషి యొక్క శారీరక శ్రమ, మేథోశ్రమ రెంటినీ కలిపి చేసేందుకు మనిషి రోబోట్లను సృష్టించాడు. అంటే రోబోట్లు ఒకరకంగా మనిషి ప్రతిరూపాలన్నమాట. కాని ఇప్పుడున్న రోబోట్లు చాలా శైశవ దశకు చెందినవి. రానున్న కాలంలో మనిషిలా ఆలోచించి, మనిషిలా పనిచేయగల రోబోట్ల సృష్టి జరుగుతుంది. అప్పుడు మనిషి తరఫున అనేక పనులు ఈ రోబోలే చేసి పెడతాయి. ఒక పెద్ద అణువిద్యుత్ కేంద్రంలో ఏదైనా లోపం వస్తే ప్రమాదాలను ఎదుర్కొంటూ మనిషి అక్కడికి వెళ్లక్కర్లేదు. రోబో వెళ్లి పరిస్థితిని మదింపు వేసుకుని మరమ్మతు చేసి వచ్చేస్తుంది. అలాగే ఇతర గ్రహాలకు కూడా మనుషుల తరఫున రోబోలే వెళ్లి వస్తాయి. అయితే మనిషికి పూర్తి ప్రతిరూపంగా రోబోలు తయారవుతాయా? మనిషిని మించిపోతాయా?... ఈ విషయాలను గురించి మరోసారి చర్చిద్దాం. కాని సుదూర కాలంలో కూడా మనిషి మెదడు పెరిగిపోయి, శరీరం తరిగిపోయే అవకాశం లేదని మాత్రం మనం తెలుసుకోవాలి.

✣

కొత్త పుస్తకాలు

కమ్యూనిస్టు విలువలు

విలువలంటే ఏంటి? వాటి వెనుక వర్గ ప్రాతిపదిక ఏంటి? అందులో పాటించదగినవేవి? వదిలేయవల్సినవేవి? కాలంతో మారేవేవి? ఇలాంటి చాలా ప్రశ్నలకు జవాబులు మార్క్సిస్టు మహానాయకుల రచనల నుంచి, జీవితాల నుంచి లభిస్తాయి. ఈ పుస్తకం వాటి సంకలనం. మార్క్స్, ఎంగెల్సు, లెనిన్, స్టాలిన్, మావో, హోచిమన్, సుందరయ్య, ఎ.కె. గోపాలన్‌ల స్మృతుల నుంచి ఉపయుక్త భాగాలిందులో ఉన్నాయి. వీటిలో కొన్ని లోగడ కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) సంకలనంలోనూ ఉపయోగించారు. ప్రస్తుత సంకలనంలో అదనంగా స్టాలిన్, మావో, హోచిమన్ రచనలను చేర్చారు. అలాగే ప్రజలమనుషులుగా పేరొందిన కమ్యూనిస్టు నేతలు సుందరయ్య, ఎ.కె. గోపాలన్‌లను జతచేశారు. వీరతెలంగాణా యోధులకు సంబంధించిన భాగంతో ఈ పుస్తకం ముగుస్తుంది. దీనిలో ప్రధానంగా సమాజంలో విలువలు తలకిందులయ్యే తీరును, ఈ విలువల విషయంలో కమ్యూనిస్టుల దృక్పథాన్ని చాలా చక్కగా వివరించారు.

కమ్యూనిస్టు విలువలు

వెల: 30-/
పేజీలు: 116
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్ హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్, అన్ని బ్రాంచీలలో దొరుకును.

స్నేహం, ప్రేమ, కుటుంబం, స్త్రీ పురుష సంబంధాలు వంటి అంశాలపై అభిప్రాయలిందులో ఉన్నాయి. సహచరుల పట్ల శ్రద్ధ, వ్యక్తిగత దూషణ భూషణలపై నిరాసక్తత, నమ్రత, త్యాగనిరతి వంటి ఉదాత్త లక్షణాలకు ఉదాహరణలున్నాయి. గొప్ప కమ్యూనిస్టులందరిలో సమానంగా కనిపించే ఈ అంశాలు ఎంతైనా ఉత్తేజాన్నిస్తాయి.

ఈ పుస్తకంలోని చాలా భాగాలు లోగడ వివిధ పుస్తకాలలో వచ్చినవే అయినా ఇవి అనేకమందికి చాలా ఉపయోగకరమైనవి. మరెందరికో నూతనోత్తేజాన్నందిచేవి. ఇటువంటి పుస్తకాన్నందిచిన ప్రజాశక్తి బుక్‌హౌస్ వారికి కృతజ్ఞతలు.

- లీల

అర్థంతో... అక్షరక్రమంతో

చిన్నారుల పేర్లు

చంటి పిల్లల్ని పెంచడానికి శాస్త్రీయ విజ్ఞానం
వెల: 32/-, పేజీలు: 176
ప్రతులకు: ప్రజాహిత పబ్లిషర్స్, గోల్కొండ క్రాస్ రోడ్, హైదరాబాద్

మూగ రాగం

సూరిశెట్టి, జ్యోతీశ్వర్ రావు 'జ్యోతి'
ప్రకాశం జిల్లా రచయితల సంఘం
వెల 10/-, పేజీలు: 40
ప్రతులకు: ఆంధ్రాప్రింటర్స్ ఎం.ఎం. కాంప్లెక్స్, అనకాపల్లి.



కవితల సమాహారం

ఒక నిర్దిష్ట కాలంలో వివిధ సందర్భాలలో ఆయా కవులు స్పందించిన కవితల్లో మేలైనవి ఏరి పుస్తకంగా పదిల పరచటమంత సులువైన విషయం కాదు. 'కవితావార్షిక 2005' సంకలన కర్తలు ముందు మాటలో పేర్కొన్నట్టు దాదాపు తొమ్మిది వందల పైచిలుకు కవితల్ని సేకరించారు. వీటిని కొన్ని ప్రత్యేక ప్రమాణాలతో, ఒక ప్రాతినిధ్య సంకలనంగా రూపొందించారు. ఈ క్రమంలో తొలి ప్రయత్నంగా స్వీకరించినా వాసిలోనూ, ప్రచురణాపరంగా నాణ్యతలో సృజనలోకం వెనుకాడలేదు. చక్కని సంకలనాన్నే తెచ్చింది. తదనంతరం మరో రెండు సంకలనాలు రావటం ఆహ్వానించదగ్గ పరిణామమే. ఒక క్రమవికాసాన్ని, పరిణామాన్ని తెలుసుకోవడానికీ, సామాజిక చలనాన్ని బేరీజు వేసుకోవడానికీ ఈ సంకలనం చక్కగా ఉపకరిస్తుంది. మంచి కవిత్వాన్నందించడమే ప్రధానధ్యేయంగా వినూత్న ప్రతిపాదనలతో వస్తు శైలి విన్యాసాలతో వైవిధ్య భరితంగా ఈ సంకలనాన్ని వెలువరించడంలో నిర్వాహకులు కృతకృత్యులయ్యారు. ఈ చారిత్రక బాధ్యతను స్వీకరించడానికి 'సృజనలోకం' నిర్వాహకులు తొలుత నడుంకట్టారు. వీరిని తెలుగు సాహిత్య రంగమభినందిస్తుంది. హృదయాన్ని స్పృశించే, పరవశింపచేసే, ఆలోచింపజేసే కవితలు ఎనభైదాకా ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.



కవితా వార్షిక 2004
ప్రచురణ సృజనలోకం
(లైటర్స్ కార్నర్) వరంగల్లు,
పేజీలు 158,
వెల 100/- ప్రతులకు:
సృజనలోకం 16-10-1294
శివనగర్,
వరంగల్లు-506002

ప్రపంచీకరణ దృక్పథం, యాంత్రిక వ్యాపార జీవనశైలి భారతంలో సగటు మనిషి జీవితాన్నెంతగా అతలకుతలం చేస్తున్నాయో ఈ కవితలు మనకు తెలియజేస్తాయి. అస్తిత్వ పరివేదనల్లో నిజాయితీని, నిజాలనూ తెలంగాణాకవులు చక్కగా చిత్రించారు. సార్వజనీన అంశాల మీద సంధించిన కవితలో రైతు ఇతివృత్తంగా వచ్చిన కవితలను బలంగా వ్యక్తీకరించారు. కత్తి పద్మారావు, ఎన్.గోపి, పాపినేని శివశంకర్, నందినీ సిద్దారెడ్డి, జింబో కన్నీటి రోడ్డులో ఆవిష్కరిస్తారు. జులూరి గౌరీ శంకర్, సి. నారాయణరెడ్డి లాంటి కవుల కవితలతో ఈ 'కవితా వార్షిక 2004' ఆకర్షణీయంగా, ఖరీదైన ప్రచురణగా అందించడానికి నిర్వాహకుల తీసుకున్న శ్రద్ధ ప్రశంసనీయం. ప్రతి కవిత్వ ప్రేమికుడూ తప్పక చదివి తీరాల్సిన పుస్తకమిది.

- వర్ధుల శివకుమార్

గోల్డెన్ బర్ఫీ

కావలసిన వస్తువులు

శనగపిండి	:	ఒక గ్లాసు
పంచదార	:	రెండున్నర గ్లాసులు
పాలు	:	ఒక గ్లాసు
కొబ్బరికోరు	:	ఒక గ్లాసు
నెయ్యి	:	ఒక గ్లాసు
ఏలకులు	:	పది
జీడిపప్పు	:	50 గ్రాములు

తయారుచేసే విధానం

కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు వేయించి పక్కన పెట్టుకోవాలి. రెండు స్పూన్లు నెయ్యి వేసి కొబ్బరికోరు వేయించుకోవాలి. తరువాత శనగపిండి కూడా రెండు స్పూన్లు నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. చల్లారిన తరువాత శనగపిండి, పాలు, పంచదార, కొబ్బరికోరు, మిగిలిన నెయ్యి వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని అడుగుమందంగా ఉన్న గిన్నెలో పోసి సన్నని సెగమీద ఉడకనివ్వాలి. అడుగు అంటకుండా కలుపుతూ ఉండాలి. చివరిలో ఏలకుల పొడి వేసి కొంచెం గట్టిగా అవగానే దించాలి. వెడల్పు ప్లేటుకు అడుగున నెయ్యి రాసి మిశ్రమాన్ని అందులో పోయాలి. చేతికి నెయ్యి రాసుకొని చదరంగా చెయ్యాలి. పైన జీడిపప్పులు గుచ్చి అలంకరించాలి. దీనిని ముక్కలుగా కోసుకోవాలి. ఇది వారం, పది రోజులు నిల్వ ఉంటుంది.

రుచి

మాల్‌పూరీ

కావలసిన వస్తువులు

గోధుమపిండి	:	పావు కిలో
మైదా	:	50 గ్రాములు
నూనె	:	అరకిలో
పంచదార	:	450 గ్రాములు

తయారుచేసే విధానం

పంచదారను గులాబ్‌జామ్ పాకం కన్నా కొద్దిగా ముదురుగా పట్టుకోవాలి. గోధుమ పిండి, మైదా పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. గోధుమ పిండి, మైదా, కొద్దిగా పంచదార కలిపి అట్ల పిండికన్నా పల్చగా కలిపి రెండు గంటలు నానబెట్టాలి. తరువాత బాండీలో నూనె పోసి కాగిన తరువాత గిన్నెతో అట్లులాగా పోసి కాలిన తరువాత పాకంలో వెయ్యాలి. ఇవి పాకం పీట్చుకొని చాలా రుచిగా ఉంటాయి.



సమదృష్టి

పి.జ్యోతి

పూర్వం సింహళ దేశాన్ని వజ్రసేన మహారాజు పరిపాలించేవాడు. ఆయనది కవితా హృదయం. అందువలన ఎల్లప్పుడూ తన సభలో కవితాగోష్ఠి నిర్వహించే వాడు. ఎవరు కవిత్వం బాగా చెబితే వారిని సత్కరించి అనేక విలువైన కానుకలను అందించేవాడు.

ఆ సమయంలోనే మహారాజు దృష్టిలో ఒక నమ్మకం ఏర్పడింది. కేవలం పండితులు మాత్రమే ఎంతో బాగా కవిత్వం చెప్పగలరని మిగతా వారెవ్వరూ అంత అద్భుతంగా చెప్పలేరని గట్టిగా అనుకునేవాడు.

ఇలావుండగా ఆ రాజ్యంలో ఓ సంఘటన జరిగింది. ఒకసారి రామప్ప అనే వడ్రంగి... పండితుడైన కృష్ణశర్మకు ఎదురయ్యాడు. రామప్పకు కూడా కవిత్వం అంటే చాలా ఇష్టం. అందుకే ఆయనను చూడగానే ఒక చిన్న కవిత అల్లి వినిపించాడు. కృష్ణశర్మ రామప్ప వంక నిరసనగా చూస్తూ "నువ్వేమైనా పండితుడవనుకున్నావా..? పెద్ద కవిత్వం చెబుతున్నావే. నీలాంటి వాళ్ళు తమకు తగ్గ పని చేసుకు బతకాలిగానీ నాలాంటి వారితో పాండిత్యంలో పోటీ పడగలరా?" అన్నాడు కోపంగా.

ఇందుకు రామప్ప మనసు చివుక్కుమంది. "అయ్యో! నేను మీతో పోటీ పడగలవాణ్ణి కాను. మీరెక్కడ? నేనెక్కడ? మీకూ నాకూ నక్కకూ నాగలోకానికీ వున్నంత తేడా వుంది. ఏదో తమరు కనబడేసరికి నాలో వున్న ఆసక్తి అలా చెప్పించింది. అంతే బాబూ. నన్ను మన్నించండి" అన్నాడు వినయంగా రామప్ప. దీంతో కృష్ణశర్మ కాస్త అహంకారంతో రామప్ప వైపు చూస్తూ "ఏదైతేనేం! నువ్వు నాముందే కవిత్వం వినిపించి నన్ను చిన్న చూపు చూశావు. దీనికి పరిష్కారం ఒక్కటే వుంది. ఇద్దరం మహారాజు దగ్గరకు వెళ్ళి అక్కడ పోటీ పెట్టుకుందాం. అందులో నువ్వు గెలవవు. అది నాకు తెలుసు. ఒకవేళ నువ్వు గెలిస్తే నేను మళ్ళీ జన్మలో కవిత్వం చెప్పను" అన్నాడు సవాల్ చేస్తున్నట్టు.

అందుకు రామప్ప "అయ్యా! తమరితో పోటీనా! నా వల్ల కాదు. నన్ను ఇలా వుండనివ్వండి" అన్నాడు దీనంగా. "ఊహూ! అదేం కుదరదు. వెళ్ళి తీరాల్సిందే" అంటూ బలవంతంగా లాక్కుపోయాడు రామప్పను.

మహారాజు వీరిద్దరికీ పోటీ నిర్వహించాడు. రాజుగారికి కృష్ణశర్మే గెలుస్తాడని గొప్ప నమ్మకం వుంది. పోటీ కొనసాగుతోంది. కృష్ణశర్మ చెప్పేది ఒక రకంగా వుంది. రామప్ప చెప్పే విధానం మరో రకంగా వుంది. కృష్ణశర్మ చెప్పేది కేవలం పండితులకు మాత్రమే అర్థమయ్యే రీతిలో వుంది. కానీ రామప్ప చెప్పేది మాత్రం పండితులకే కాకుండా పామరులకు సైతం అర్థమయ్యేరీతిలో స్పష్టంగా, సరళంగా వుంది. అక్కడ సభలో వున్న ప్రతి ఒక్కరూ అతనికి జేజేలు పలికారు. ఇక కృష్ణశర్మ చెప్పేది ఒక్క పండితులకు తప్ప మిగతా వారంతా అర్థంకాక తెల్లముఖం వేశారు.

ఇది చూసిన మహారాజుగారికి అమితానందం, ఆశ్చర్యం కలిగాయి. పండితులకు మాత్రమే అర్థమయ్యే విధంగా కవిత్వం చెప్పడం వలన ఏమాత్రం లాభం లేదు. సామాన్యులు కూడా తెలుసుకునే విధంగా చెప్పగలగాలి. అందువలన ఎంతో మంది ఆనందపడి ఎన్నో విషయాలను తెలుసుకోగలరు. కాబట్టి ఆ విధంగా చెప్పి అందరినీ ఆకట్టుకున్న ఘనత రామప్పకు దక్కింది. అందుకు అతడికి ఎన్నో కానుకలు ఇచ్చి బ్రహ్మాండంగా సత్కరించి తన ఆస్థానంలో కవిగా నియమించాడు మహారాజు.

అప్పుడుగానీ తెలియలేదు కృష్ణశర్మకు తాను ఎంత తప్పుగా, అల్పంగా మాట్లాడాడో. రామప్ప దగ్గరకు వెళ్లి క్షమించమని అడిగాడు. అందుకు రామప్ప "అయ్యా! మీరు చెప్పిన కవిత్వమూ గొప్పగానే వుంది. ఒక్కొక్కరూ ఒక్కో విధమైన శైలిలో చెబుతారు. ఎవరి పంథా వారిది. కాకపోతే మేమే గొప్పవాళ్లం అన్న అహంభావం వుండకూడదు. అందరినీ 'సమాన దృష్టి'తో చూడటం మంచి లక్షణం. ఇకనుండే మీరు అది అలవరుచుకుని మీ కవితా హృదయాన్ని విశాలం చేసుకోండి" అని చెప్పాడు. అందుకు కృష్ణ శర్మ రామప్పకు కృతజ్ఞతలు తెలియజేసి అక్కడి నుండి వెళ్ళి పోయాడు.